ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 08.03.2026 | సంపుటి : 12 సంచిక : 228 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## గాంధేయ మార్గమే ఆదర్శం

### యుద్ధంతో సాధించేది లేదు

అజ్ఞాతంలో ఉన్న గణపతితో సహా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా, గణపతికి ఆరోగ్యం బాగా లేదని తెలిసింది. ఆయన కూడా లొంగిపోవాలి. గణపతి లొంగిపోతే ఆయనకు రక్షణ కల్పిస్తామని హామీ ఇస్తున్నా. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీలో ఉన్న వాళ్లు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలి. అందరూ కలిసి వస్తే తెలంగాణను పునర్నిర్మించుకుందాం. గూడేలు, తండాల్లో ఉన్నవారి మెరుగైన జీవితానికి కృషి చేద్దాం. ఆదివాసీ, గిరిజనుల ఆర్థికస్థోమత పెరిగేలా మేం కృషి చేస్తున్నాం." - సీఎం రేవంత్ రెడ్డి

- ప్రజలతో మమేకమై పనిచేయండి
- తెలంగాణ గడ్డపై హింసకు తావులేదు
- అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం
- ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తాం
- గణపతిజీ వచ్చేయండి
- సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- 130 మంది మావోయిస్టులు లొంగుబాటు
- 124 ఆయుధాలు అప్పగింత



హైదరాబాద్(జనంసాక్షి): శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. రాష్ట్ర స్థాయిలో మిగతా 2లో..

### మహిళల భద్రతే తొలి ప్రాధాన్యత

- వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
- ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
- స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం

### హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి

- ప్రతీరోజు చెత్త సేకరణ జరగాల్సిందే
- క్యూర్ పరిధిలో ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

### బడ్జెట్ సమావేశాలు మార్చి 16 నుంచి

30 వరకు నిర్వహణ.. నోటిఫికేషన్ జారీ

ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించున్న నూతన గవర్నర్ వార్త 2లో



## చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు



### కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు • గద్దర్ అవార్డుల ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి): 2025లో విడుదలైన చిత్రాలకు గద్దర్ అవార్డులను శనివారం ప్రకటించారు. అగ్ర నటుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. ఇక, ప్రముఖ నటుడు కమల్ హాసన్‌ను పైడి జయరాజ్ అవార్డు, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సినారె అవార్డు వరించింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు, షార్ట్‌ఫిల్మ్‌లకు ఈ అవార్డులు ప్రకటించారు. మార్చి 19 ఉగాది రోజున ఈ పురస్కారాల ప్రదానం జరగనుంది.

**స్పెషల్ అవార్డులు..**

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి, పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్,బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు- సింగీతం శ్రీనివాసరావు,నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనీ దత్,కె.ఎల్.కాంతారావు ఫిల్మ్ అవార్డు -ఆర్. నారాయణమూర్తి,రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు - రమేశ్ ప్రసాద్,సి.నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డు - సుద్దాల అశోక్ తేజ, అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ అవార్డు - జయసుధ,

**ఫీచర్ ఫిల్మ్స్..**

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా,ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో,ఉత్తమ జాతీయ సమగ్రత చిత్రం - తండేల్,ఉత్తమ పర్యావరణ చిత్రం - ఇగ్వా,ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ (డెబ్యూ) - లిటిల్ హార్ట్స్, మిగతా 2లో..

## 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి



### హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి

### పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో మిగతా 2లో..

## శాంతి కోసం రంగంలోకి కేఏ పాల్

- యుద్ధాన్ని ఆపేందుకు అందరం కలిసి పనిచేద్దాం
- మూడు దేశాల ప్రతినిధులతో నిరంతరం మాట్లాడుతూ..
- ఇరాన్ ప్రత్యేక ప్రతినిధి అయతోలాతో భేటీకాల్పుల విరమణకు పిలుపు

ఢిల్లీ(జనంసాక్షి):అంతర్జాతీయ శాంతి స్థాపనే లక్ష్యంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఢిల్లీలో ఇరాన్ ప్రత్యేక ప్రతినిధి అయతోలాతో ఆయన సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ప్రధానంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించడం, శాంతిని నెలకొల్పడంపై ఈ సమావేశంలో చర్చించినట్లు పాల్ వెల్లడించారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఘర్షణలు ఆగిపోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.యుద్ధం వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని అడ్డుకునేందుకు మిగతా 2లో..



## పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది

### అందుకే ఇకపై దాడులు చేయబోమని వారికి క్షమాపణలు చెప్పింది



- పశ్చిమాసియాను ఆ దేశం ఇక బెదిరించలేదు
- అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడుల వల్లే ఇది సాధ్యమైంది:ట్రంప్
- ఇరాన్‌పై అతిపెద్ద దాడి: అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్
- ఇరాన్ యుద్ధనౌక నుంచి ప్రాణాలతో బయటపడినవారిని స్వదేశానికి పంపాద్దు
- శ్రీలంకపై అమెరికా ఒత్తిడి

వాషింగ్టన్(జనంసాక్షి):దాడుల విషయంలో గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పిన వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పశ్చిమాసియాలో ఓటమి పాలైన దేశంగా ఇరాన్‌ను పేర్కొన్నారు. ఆ దేశం దాని పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి లొంగిపోయిందన్నారు. ఇకపై దాడులు చేయబోమని కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదని 'ట్రూత్ సోషల్' మిగతా 2లో..

### అమెరికా బలగాల కోసం వేచిచూస్తున్నాం

హార్ముజ్ జలసంధి వద్ద రక్షణకల్పిస్తామన్న అమెరికా వ్యాఖ్యలపై ఐఆర్‌జీసీ కౌంటర్



### లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

41 మంది మృతి

2లో..

## ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్న కలలను సమాధి చేసుకోవాల్సిందే

### ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కౌంటర్

- గల్ఫ్ దేశాలపై ఇకపై ఎలాంటి దాడులు జరగబోవు
- ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకూడదనే ఈ నిర్ణయం
- వారిపై దాడులు చేయడం మా ఉద్దేశం కాదు
- పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పిన మసౌద్ పెజెష్కియాన్
- ఖమేనీ నలుగురు కుమారులు క్షేమం
- ఆన్‌లైన్‌లో ఫోటోలు విడుదల
- ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సాయం!




టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా- ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఆయన ఓ వీడియోలో మాట్లాడారు.ఈ సందర్భంగా గల్ఫ్ దేశాలపై ఇకపై ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ ప్రకటించారు. అయితే, పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం.. స్పందించే హక్కు తమకు మిగతా 2లో..

## మార్చిలోనే మండుతోంది

### తెలంగాణలో 40 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

- ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు
- వాడగాలులు వీచే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక



హైదరాబాద్(జనంసాక్షి): మార్చి ప్రథమార్ధంలోనే తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్రంలో పలు చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. గతేడాది కంటే ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చెప్పింది. చిన్న పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ ఏడాది అధిక వర్షపాతం, ఎక్కువ చలి తీవ్రత వల్లే ఎండలు అధికంగా ఉంటాయని పేర్కొంది.

ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతున్నది. ఈ సీజన్‌లోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకావం ఉందని వాతావరణ శ్ఙాఖ హెచ్చరించింది. తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీచే అవకాశమున్నదని హెచ్చరించింది .రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరుగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. తరుచుగా తగిన మోతాదులో నీరు తాగాలని సూచించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రయాణాలను తగ్గించుకోవాలని కోరారు.ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల ప్రజలు మరింత జాగ్ర త్తగా ఉండాలంటూ మిగతా 2లో..

## కాంగ్రెస్ సర్కార్ విధ్వంసానికి కేరాఫ్

- సీఎంకు బూతులు మాట్లాడటమే తప్ప.. రైతులపై కష్టాలపై లేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణుడు కాదు.. మహా క్రూరుడు.
- చొప్పదండి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో హరీశ్



కరీంనగర్(జనంసాక్షి):మహాభారతంలో కర్ణుడి లాగా నేను కూడా నా స్నేహితులకు సహాయం చేస్తాను.. అది కొంత మందికి నచ్చవచ్చు, కొంత మందికి నచ్చక పోవచ్చు అని ఓ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై హరీష్ రావు తనదైన స్టైల్‌లో చురకలంటించారు. ఖమ్మంలో వెలుగుమట్ల బాధితుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇండ్లు కూల్చేసినప్పుడు బాధితులు గుండెలవిసేలా రోదిస్తే, అక్కడికి బందోబస్తుకు వెళ్లిన పోలీసులు కూడా కంటతడి పెట్టారని అన్నారు.మహాభారతంలో కర్ణుడి లాగా నేను కూడా నా స్నేహితులకు సహాయం చేస్తాను.. అది కొంత మందికి నచ్చవచ్చు, కొంత మందికి నచ్చక పోవచ్చు అని ఓ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై హరీష్ రావు తనదైన స్టైల్‌లో చురకలంటించారు. తన ఛాతిని చీరి కవచ కుండలాలు అందించినటువంటి వ్యక్తి కర్ణుడు. రేవంత్ రెడ్డి కర్ణుడా.. క్రూరుడు. మిగతా 2లో..

## రాజకీయ లబ్ది కోసం సినిమాలను వాడుకుంటున్నారు



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాజకీయ లబ్ధి కోసం కొందరు వ్యక్తులు సినిమాలను ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పలు వివాదాల నడుమ ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' సినిమాపై స్పందిస్తూ.. మిగతా 2లో..

- 'ది కేరళ స్టోరీ 2' చిత్రాన్ని ఎవరూ చూడట్లేదు: రాహుల్
- నిజమైన కేరళ సంస్కృతి సంప్రదాయాలు ఏంటో దేశ ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్య

### రాజమండ్రిలో కల్తీపాల ఘటన

## ఎంసీల్ పూత కారణంగా రసాయనాల ఉత్పత్తి

అవి పాలల్లో కలవడంతో విషపూరితంగా మార్పు

ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు వెల్లడి

అమరావతి(జనంసాక్షి):రాజమండ్రిలో కల్తీ పాల మరణాలపై ఫోరెన్సిక్ ల్యాబ్ సంచలన విషయాలు వెల్లడించింది. ఈ కేసులో ఐదుగురి మరణాలకు సంబంధించిన ల్యాబ్‌ల నుంచి వచ్చిన తుది మిగతా 2లో..

## నిరుద్యోగులపై మమత వరాల జల్లు

### నెలకు రూ.1500 నిరుద్యోగ భృతి

కోల్‌కతా(జనంసాక్షి):త్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని పదో తరగతి పాసై ఉద్యోగాలు లేని వారికి నెలకు రూ. 1500 నిరుద్యోగ భృతి అందించనున్నట్లు వెల్లడించారు. నేటి నుంచే ఈ డబ్బులు నిరుద్యోగుల మిగతా 9లో..

## ఏఐ ఆర్థిక ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి శ్రీధర్ బాబు




**మంథని, (జనంసాక్షి) :** కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో ఆయన కీలకోప న్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. "కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్ యుబిఎస్, వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్, గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలో పేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది". కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గని ర్దేశం చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఈ సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (విజెఇఎం) అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ పాల్గొన్నారు.

# హైడ్రా అంటే చెరువుల రక్షణ కవచం

- బమ్మకున్ - ఉద్ - దౌలాతో మరోసారి నిరూపితం
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రజలకు అంకితం



**హైదరాబాద్, మార్చి 07 (జనంసాక్షి) :** హైడ్రా అంటే నగర నిర్మాణం... హైడ్రా అంటే చెరువులకు రక్షణ కవచం.. ప్రాణవాయువును అందించే పార్కులను కాపాడేది హైడ్రా. ప్రజావసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములు కబ్జాల పాలవ్వకుండా కాపాడే వ్యవస్థ హైడ్రా. పర్యావరణహితమైన నగరని ర్మాణం జరగాలన్న ప్రభుత్వ లక్ష్యం దిశగా హైడ్రా అడుగులేస్తోంది. మొదటి విడత పునరుద్ధరించ తలపెట్టిన 6 చెరువుల్లో గతేడాది అంబర్‌పేటలోని బతుకమ్మకుంటకు జీవంపోస్తే.. ఈ ఏడాది పాతబస్తీలోని బమ్మకున్ - ఉద్ - దౌలా లేక్ తో పాటు.. కూకట్‌పల్లి నల్లచెరువును అందుబాటులోకి తెస్తోంది. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. నగర నిర్మాణం అనేట్టు నగరంలో రూపుదిద్దు కుంటున్న చెరువులు రుజువు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారు ఆదివారం సాయంత్రం 7 గంటలకు బమ్మక్‌నుద్దౌలా చెరువును ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖలు పూర్తి చేశాయి. 2 వేల మందికి పైగా కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. చెరువు చరిత్రను చెబుతూ తయారు చేసిన ఏవీ ప్రదర్శనకు వెసులుబాటుగా డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**మరుగునపడిన చరిత్రకు జీవం..**

బమ్మక్‌నుద్దౌలా చారిత్రక చెరువు. 1770లో ఈ చెరువును నిజాం పాలనలో నిర్మించారు. 250 ఏళ్ల క్రితం ఈ చెరువును నిర్మించారు. ఒకప్పుడు 104 ఎకరాలకు పైగా ఉండేదని చరిత్ర చెబుతోంది. ఈ చెరువు చరిత్రను పరిశీలిస్తే.. నిజాం పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న ఘీఖఘఎ వీఅతీ వీశీశీయి ఖష్ఘుఅ =బఎఅ-బం-ణశీఁశ్రీఖ దీఘ్ఘుణబతీ దీనిని నిర్మించారు. ఆ కాలంలో హైదరాబాద్ నగరంలో తాగునీటి కొరత ఎక్కువగా ఉండేది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రుక్న్-ఉద్-దౌలా తన సొంత నిధులతో ఈ చెరువును నిర్మించారు. నిజాం నవాబులు ఈ చెరువులో వనమూలికల బెరడులు, కొమ్మలు వేసి.. చెరువు కింద తవ్విన ఊట బావిలో నీటిని వాడేవారని.. ఔషధ గుణాలుండేవి అని.. చరిత్రకారులు చెబుతున్నారు. ఈ చెరువు వద్ద మొహర్రం సందర్భంగా జరిగే కార్యక్రమాల కోసం ఒక ఆశూర్‌ఖానాను కూడా నిర్మించారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు ఈ చెరువు నీటిని ఉపయోగించు కోవచ్చని ఆయన ప్రకటించారు. దీంతో ఈ చెరువు హైదరాబాద్ నగర ప్రజలకు ముఖ్యమైన నీటి వనరుగా నిలిచింది. కాలక్రమంలో ఆక్రమణలకు గురై నాలుగున్నర ఎకరాలకు పరిమితమైంది. పాతబస్తీ నుంచి చెరువుల పునరుద్ధరణ చేపట్టాం. ఆక్రమణలు తొలగించి 17.50 ఎకరాలకు విస్తరించాం. ఈ చెరువు ఎంతో సుందరంగా తయారయ్యింది. నేల మీద నెలవంకను తలపిస్తోంది.

**హైడ్రా పనితనానికి నిదర్శనం..**

250 ఏళ్ల చరిత్ర ఉన్న చెరువు కబ్జాలపాలవుతుంటే చాలా బాధ పడ్డాం.. ఇప్పుడు చెరువును హైడ్రా పునరుద్ధరించిన తీరును చూస్తే ఎంతో ముచ్చటేస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా పనితనానికి నిదర్శనంగా ఈ చెరువు నిలుస్తుందని కొనియాడారు. ఆదివారం ముఖ్యమంత్రి ప్రారంభోత్సవంలో పెద్దయెత్తున పాల్గొనడానికి సిద్ధమయ్యారు. భారీగా తరలివచ్చి సీఎంకు స్వాగతం పలుకుతామని చెబుతున్నారు. ఈ ఏర్పాట్లను హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్, హైడ్రా ఏసీపీలు తిరుమల్, ఉమామహేశ్వర రావుగారు పరిశీలించారు. చెరువు అభివృద్ధిని చూసి.. హైడ్రా అధికారులను స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. ఆదివారం జరగనున్న కార్యక్రమాలను అధికారులతో సమీక్షించారు.

## అవినీతి తిమింగలంగా తహసీల్దార్

- ఏసీబీ దాడుల్లో కోట్ల అక్రమాస్తుల గుట్టు రట్టు
- గజ్వేల్ తహసీల్దార్‌పై అక్రమాస్తుల కేసు
- కరీంనగర్‌లో ఇళ్లు, ఫ్లాట్లు, ఖాళీ స్థలాల గుర్తింపు
- నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలింపు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 07 (జనంసాక్షి) :** ప్రభుత్వ పదవిని అడ్డంగా ఉపయోగించి కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడబెట్టిన అవినీతి తిమింగలం ఏసీబీ వలలో చిక్కింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల తహసీల్దార్ కమటం శ్రవణ్ కుమార్ పై ఆదాయ వనరులకు మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం రోజు నిర్వహించిన సోదాల్లో భారీ స్థాయిలో అక్రమ సంపాదన వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ పట్టణానికి చెందిన ఈ అధికారి అధికార పదవిలో ఉండగానే అనుమానాస్పద మార్గాల్లో కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఏసీబీ అధికారులు నిందితుడి నివాసంతో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో కరీంనగర్ పట్టణంలో రెండు ఇళ్లు, ఆరు ఫ్లాట్లు కలిగిన ఒక అపార్ట్‌మెంట్, నాలుగు ఖాళీ స్థలాలు బయటపడ్డాయి. ఈ స్థిరాస్తుల విలువ సుమారు రూ.2,47,33,540గా అధికారులు అంచనా వేశారు. ఇక చరాస్తుల పరంగా రెండు ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం, బంగారు నగలు, గృహోపకరణాలు, భారీ నగదు గుర్తించారు. రెండు ద్విచక్ర వాహనాల విలువ రూ.1,60,000గా, ఒక నాలుగు చక్రాల వాహనం విలువ సుమారు రూ.30 లక్షలుగా నమోదు చేశారు. బంగారు నగలు సుమారు రూ.4,20,000 విలువగా ఉండగా, గృహోపకరణాల విలువ రూ.15,66,000గా అంచనా వేశారు. అదనంగా రూ.11,90, 000 నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో బయటపడిన స్థిర, చరాస్తుల మొత్తం విలువ సుమారు రూ.4 కోట్లకు పైగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అధికారిక అంచనాల కంటే మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ప్రభుత్వ పదవిని దుర్వినియోగం చేసి ఈ ఆస్తులు కూడబెట్టినట్లు సోదాల్లో లభించిన పత్రాలు సూచిస్తున్నాయని తెలిపారు. ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థా నంలో హాజరుపరచి న్యాయ నిర్బంధానికి తరలించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడిం చారు. అక్రమ సంపాదనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.



## విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

**సంగారెడ్డి (జనంసాక్షి) :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను ప్రతిభ చాటాలని ప్రిన్సిపల్ ప్రీతి పేర్కొన్నారు. సదాశివపేట జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన స్కూల్ ఎక్స్‌పోలో క్రీడలపై ప్రత్యేక ప్రాజెక్ట్ ప్రదర్శించారు. ఈ ప్రాజెక్ట్ విద్యార్థుల్లో క్రీడల ప్రాముఖ్యత, శారీరక దృఢత్వంపై అవగాహన పెంచుతుందని స్పష్టం చేశారు. శారీరక విద్య ఉపాధ్యాయులు సాయి కిరణ్ మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కాగా, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. సైన్స్ టీచర్ రాణా ప్రతాప్ విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రదర్శనను ప్రశంసించారు. కరస్పాండెంట్ రఘువర్ధన్ రెడ్డి, మరియు డైరెక్టర్ అమరేంద్ర రెడ్డి, స్కూల్ ఎక్స్‌పో విజయవంతంగా నిర్వహించినందుకు అభినందించారు.

## సివిల్స్ రేసులో తెలంగాణ మైనార్టీలు 'సున్నా'

- నిద్రావస్థలో 'స్టడీ సర్కిల్'
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా ఆగ్రహం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశవ్యాప్త సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఫలితాల్లో తెలంగాణ మైనారిటీ అభ్యర్థుల ప్రాతినిధ్యం శూన్యం కావడం పట్ల మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.... దేశవ్యాప్తంగా 52 మంది ముస్లిం అభ్యర్థులు సివిల్స్ సాధిస్తే, తెలంగాణ నుండి ఒక్కరు కూడా ఎంపిక కాకపోవడం విస్మయానికి గురిచేస్తోందని మండిపడ్డారు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి పునరావృతం కావడం రాష్ట్రంలోని మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైఫల్యానికి ప్రధాన కారణం రాష్ట్రంలోని మైనార్టీ స్టడీ సర్కిల్ పూర్తిగా నిద్రావస్థలో ఉండటమేనని యాకూబ్ పాషా దుయ్యబట్టారు. హైదరాబాద్‌కే పరిమితమైన ఈ కేంద్రంలో కనీస కోచింగ్ కూడా అందడం లేదని, ఇది కేవలం ఒక లైబ్రరీగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం గురించి గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందాల్సిన ప్రోత్సాహం సున్నా అని ధ్వజమెత్తారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల భారీ ఫీజులు భరించలేక ప్రతిభావంతులైన పేద విద్యార్థులు తమ ఐఏఎస్ కలలను వదులుకుంటున్నారని, తక్షణమే స్టడీ సర్కిళ్లను ప్రక్షాళన చేసి నిపుణులైన ఫ్యాకల్టీతో రాష్ట్రం లోని ఉమ్మడి జిల్లా లలో శిక్షణ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నగరంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్

- ముఠాను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** నగర ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని లాలాపేట పరిధిలో నిర్వహిస్తున్న ఒక గోడౌన్ పై టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ జోన్, లాలాగూడ పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన ముందస్తు సమాచారంతో లాలాగూడ(ఒజ్గీ÷జీణబీటజీ) పోలీసులతో కలిసి లాలాపేటలోని 'జానీ అల్లం వెల్లుల్లి పేస్ట్' గోడౌన్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండాలని, రంగు మారకుండా ఉండటానికి నిందితులు ఎసిటిన్ యాసిడ్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. ఈ సోదాల్లో దాదాపు 1,915 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 30 కిలోల ఎసిటిక్ యాసిడ్, పేస్ట్ తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర ముడి సరకులు, ప్యాకింగ్ మెటీరియల్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీలా వెంకటేశ్వర్లుతోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం లాలాగూడ పోలీసులు తీసుకెళ్లారు. నకిలీ బ్రాండ్ లేబుల్స్ తో ప్యాకింగ్ చేసి నగరాల్లోని పలు కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## సైబరాబాద్ మహిళా పోలీసుల ప్రతిభ

- ప్రతిభ, అంకితభావంతో గుర్తింపు
- శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన ముద్ర

**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, మహిళా పోలీస్ అధికారులు క్రమశిక్షణతో కూడిన పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కవాతులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, సమన్వయం, వృత్తిపరమైన అంకితభావం పరేడ్‌కు మరింత గౌరవాన్ని చేకూర్చింది. నగరానికి విచ్చేసే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు ఇచ్చే 'గార్డ్ ఆఫ్ హానర్', వారి సమయపాలన మరియు బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అద్దం పడుతోంది. కేవలం పగటి విధులతోనే పరిమితం కాకుండా, మహిళా పోలీసులు రాత్రి సమయాల్లోనూ అత్యంత అప్రమత్తతతో సెంట్రీ విధులను నిర్వర్తిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద నిరంతరం కాపలా కాస్తూ నగర భద్రతా వ్యవస్థలో తమవంతు కీలక పాత్ర పోషిస్తున్నారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, హోం గార్డ్స్ వార్షికోత్సవం వంటి అధికారిక కార్యక్రమాల్లో మహిళా పోలీసులు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. సభలను సమర్థవంతంగా నడిపిస్తూ, తమ వాగ్ధాటితో కార్యక్రమ నిర్వహణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతిష్టాత్మక 'మిస్ వరల్డ్' పోటీల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరును పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందుతున్న ఈ గుర్తింపు, ఇతర మహిళా సిబ్బందికి స్ఫూర్తినిస్తోంది. విధి నిర్వహణలో మహిళా పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రాణదాతలుగానూ నిలుస్తున్నారు. పరిగి నుంచి విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న ముగ్గురు ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు దీపశ్రీ, వనజ, పద్మలు ప్రమాద స్థలిలో చూపిన చొరవ అభినందనీయం. ప్రమాదానికి గురైన బస్సు వెనుక ప్రయాణిస్తున్న వీరు, ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నారు. క్షణమాత్రం ఆలస్యం చేయకుండా, మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది క్షతగాత్రులకు సీపీఆర్ నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు.

## కూకట్‌పల్లిలో వ్యభిచార ముఠా ఆటకట్టు

**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** కూకట్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న ఇద్దరితో పాటు మరో అయిదు మంది కస్టమర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహిళలను రెస్క్యూ చేసినట్లు చెప్పారు. ఓ సమాచారం ఆధారంగా సైబరాబాద్‌కు చెందిన ఏహెచ్‌టీయూ బృందం రెయిడ్ నిర్వహించింది. సుమిత్రానగర్‌లో ఉన్న ఇండ్లపై దాడి నిర్వహించారు. రాకెట్ నడుపుతున్న వారితో పాటు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేస్తున్నట్లు తేల్చారు.

## మహిళల హాకీకి మహత్తర ఏర్పాట్లు

- అంతర్జాతీయ టోర్నీలకు కేరాఫ్ గా హైదరాబాద్
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్ రెడ్డి




**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** మన జాతీయ క్రీడ అయిన హాకీకి పునర్వైభవం తెచ్చేందుకు, హాకీలో మహిళల భాగస్వామ్యం పెంచడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవంవరల్డ్ మహిళల హాకీ క్వాలిఫైయింగ్ మ్యాచ్ లను గచ్చిబౌలిలో నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళల హాకీ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో ఈ పోటీలో పాల్గొంటున్న ఎనిమిది జట్ల కెప్టెన్లతో కలిసి ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన జాతీయ క్రీడ హాకీ కి పునర్ వైభవం తీసుకురావడానికి క్రీడల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విధంగా స్ఫూర్తి కలిగించడానికి అంతర్జాతీయ మహిళా హాకీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాలాదేవి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ సహకారంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ టోర్నమెంట్ కు కావలసిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేయగలిగామని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ దాదాపు రెండు నెలల నుంచి చేసిన కృషి ఫలితంగా గచ్చిబౌలిలో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ను నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడిన 8 జట్ల కెప్టెన్లు తెలంగాణ క్రీడా శాఖ చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఆతిధ్యం ఆదరణ పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. అద్భుతమైన హాకీకి గచ్చిబౌలి ఆస్ట్రో టర్ఫ్ వేదిక కాబోతుందని అన్నారు.

## విడాకులు వచ్చేవరకు విజయ్ ఇంట్లోనే ఉంటాను

- అలా ఉండేందుకు ఆదేశాలు ఇవ్వండి
- కోర్టును కోరిన విజయ్ భార్య సంగీత
- తన వ్యక్తిగత జీవిత చికాకులపై స్పందించిన విజయం
- కార్యకర్తలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాని సూచన



**చెన్నై, మార్చి7 (జనంసాక్షి) :** తమిళ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నుంచి విడాకులు కోరుతూ పిటిషన్ వేసిన ఆయన భార్య సంగీత తాజాగా మరో పిటిషన్ వేశారు. నివాస హక్కులు కోరుతూ ఈ పిటిషన్ వేశారు. వివాహం తర్వాత తాము కలిసి నీలాంగరైలో నివసించిన వైవాహిక గృహంలో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ చెంగల్పట్టులోని జిల్లా కోర్టును ఆమె ఆశ్రయించారు. దీనిపై తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. విజయ్ నుంచి విడాకులు కోరడంతో ఇంట్లో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వడంలేదని కోర్టుకు సంగీత తెలిపారు. తాను లండన్‌కు చెందిన వ్యక్తిని కావడంతో మరెక్కడా ఉండేందుకు అనుమతి లేదన్నారు. తనకు విజయ్ ఇంట్లో ఉండే హక్కు ఉందని కోర్టుకు వివరించారు. విడాకుల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ నీలాంగరై ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సంగీత ఇటీవల 28 ఏళ్ల తమ వైవాహిక జీవితానికి ఉద్వాసన పలుకుతూ వివిధ కారణాల రీత్యా విడాకులు ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. విజయ్‌కు వివాహేతర సంబంధం ఉందని, అది తనకు తన పిల్లలకు అవమానంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 20న ఈ కేసు విచారణకు రానుంది. యూకేకు చెందిన సంగీత లండన్‌లో చదువుకున్నారు. 1999 ఆగస్టు 25న విజయ్‌ను వివాహమాడారు. వీరికి సంజయ్ అనే కుమారుడు, దివ్య అనే కుమార్తె ఉన్నారు. తనపై ముసురుకున్న వివాదాలపై సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎట్టకేలకు స్పందించారు. ఆ సమస్యల కారణంగా అభిమానులు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే బాధగా ఉందని వ్యాఖ్యానించారు. టీవీకే ఆధ్వర్యంలో చెన్నై సమీపంలోని చెంగల్పట్టు వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత వివాదాల గురించి తాను చూసుకుంటానని, పార్టీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ప్రత్యేక వరాలు ప్రకటిస్తూ మేనిఫెస్టో విడుదల చేశారు. ఇటీవల నాకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందుల గురించి మీరు ఆలోచించాల్సిన పనిలేదు. వాటిపై మీరు పోరాటం చేసి వాళ్లను బాధించాల్సిన అవసరం అంతకన్నా లేదు. అవన్నీ నేను చూసుకుంటాను. మీరు చేయాల్సిందల్లా ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే. నా వ్యక్తిగత విషయాలను ఎలా పరిష్కరించుకోవాలో నాకు బాగా తెలుసు. ఇవన్నీ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే నాకు బాధగా ఉంది. వాటి సంగతి తర్వాత చూస్తా అని మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ అన్నారు.

# ఫాసిజం కోరలు వ్యాపిస్తున్న తీరు!



జనమే సాక్షి

సంఘ్ పరివార్ పాలనలో ఫాసిజం వ్యాపిస్తున్నదనే మాట మీద దేశంలో ఎంతో చర్చ జరిగింది, జరుగుతున్నది. ఫాసిజం అనగానే ఇరవయో శతాబ్దంలో ఇటలీలో పుట్టి పెరిగిన ఫాసిజం, జర్మనీలో నాజీజం లతో పోల్చి చూసి, వాటికీ దీనికీ తేడాలున్నాయి గనుక దీన్ని ఫాసిజం అనవచ్చునా లేదా అని చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారు. కొన్ని ఫాసిజం లక్షణాలు ఇక్కడ కూడ పొడసూపు తుండవచ్చు గాని దీన్ని పూర్తి స్థాయి ఫాసిజం అనడానికి వీలు లేదని కొందరు మేధావులూ, కొన్ని పార్టీలూ చేసిన వాదన అందరికీ గుర్తుండే ఉంటుంది.

ఆ పండిత చర్చలను అలా ఉంచి, సంఘ్ పరివార్ ఫాసిజం మాత్రం తాను వచ్చాననీ, ఉన్నాననీ, తన కోరలు వ్యాపింపజేస్తున్నాననీ దాదాపు ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ప్రదర్శిస్తూనే ఉంది. సామాజిక మాధ్యమాల ట్రోల్ దాడులు, విష విద్వేష ప్రచారాలు, బెదిరింపులు, మూకదాడులు, హత్యా ప్రయత్నాలు, హత్యలు, బుల్డోజర్ దాడులు వంటి ఎన్నో బహిరంగ రూపాలు అలా ఉండగా, చాప కింద నీరులా కొన్ని సమూహాల మీద వ్యతిరేక, విష ప్రచారం, సమాజంలో భిన్నాభిప్రాయాల ప్రకటనల మీద అసహనం వ్యాపింప జేయడం, రానున్న హంతక కాలానికి ఉపయోగపెట్టుకోవ డానికి ఈ అసహనపు పేలుడుపదార్థాన్ని ప్రతి ఇంటికీ, ప్రతి మెదడుకూ చేర్చి నిలువ చేయడం విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. అధికార వర్గాల, ఆధిపత్య కుల, మత ఉన్మాదుల సహకారం ఉండనే ఉంది. ఫాసిజం గురించి జరిగిన విస్తారమైన మేధా చర్చలు ఎట్లా ఉన్నా, మన కాళోజీ ఎప్పుడో దశాబ్దాల కిందనే ఒక లోతైన, చిన్న, కవితాత్మకమైన నిర్వచనం ఇచ్చాడు. "ఏకీభవించనోని పీకనొక్కు సిద్ధాంతం ఫాసిజం" అన్నాడాయన. తన మాటకు ఎదురు చెప్పగూడదని, భిన్నమైన అభిప్రాయం ఉండగూడదని, అది కనబడితే అది వ్యక్తం చేసినవారి గొంతు నొక్కుతామని, అంతటా ఒకే రంగు, ఒకే మతం, ఒకే మాట, ఒకే ఆలోచన, ఒకే ఆహారం, ఒకే ఆహార్యం పరుచుకోవాలని ఫాసిజం కోరుకుంటుంది. భిన్నాభిప్రాయాలతో సామరస్యంగా వ్యవహరించాలని, గౌరవించాలని ప్రజాస్వామ్యం చెపుతుంది. అందువల్లనే ఫాసిజానికి ప్రజాస్వామ్యం అంటే మొట్టమొదటి అసహనం.

ఈ ఉపోద్ఘాతమంతా బొంబాయిలో జరిగిన ఒక ఘటన గురించి. అది చాలా సాధారణమైన ఘటనగా కనబడుతుంది గాని, రానున్న భయానక దినాలకు అది ఒక సూచిక, ఒక హెచ్చరిక. ఆలోచనాపరులూ, ప్రజాస్వామ్య ప్రియులూ ఇప్పుడే మేల్కొని ఇటువంటి ఘటనలను తీవ్రంగా ఖండించకపోతే మన సమాజంలో ప్రజాస్వామ్యం, సహనం వంటి విలువలు అలా ఉంచండి, కనీసమైన నాగరికత, తోటి మనిషి పట్ల, భిన్నాభిప్రాయం పట్ల, వైవిధ్యం పట్ల గౌరవం అనే మానవీయమైన లక్షణం కూడా అంతరించిపోతుంది. భిన్న జాతుల, భిన్న మతాల, భిన్న కులాల, భిన్న భాషల, భిన్న వాతావరణాల మహాశ్చర్యకర వైవిధ్యభరితమైన ఈ దేశం తరతరాలుగా నిర్మించుకుంటూ వచ్చిన బహుళత్వ, సహజీవన, సమ్మిళిత, ఐక్యతా సంస్కృతి ధ్వంసమై పోతుంది.

ఆ ఘటన నిజంగా ఆశ్చర్యకరమైనది. ఈ ఆధునిక కాలంలో, బొంబాయి వంటి భిన్నత్వానికి వేదిక అయిన కాస్మోపాలిటన్ నగరంలో అటువంటి సంకుచితత్వం, అసహనం వ్యక్తమవుతుందా అని కూడా ఎవరైనా అనుమానించవచ్చు.

బొంబాయిలోని జర్నలిస్టులందరికీ సంబంధించిన ప్రతిష్ఠాత్మకమైన సంస్థ బొంబాయి ప్రెస్ క్లబ్. దానికి గతంలో చైర్మన్ గా, ప్రెసిడెంట్ గా పని చేసిన సీనియర్ జర్నలిస్టు గురుబీర్ సింగ్ అని ఉన్నారు. 1980ల తొలిరోజుల్లో బొంబాయిలో ఉండిన విద్యార్థి ప్రగతి సంఘటన్ అనే ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకుడిగా, బొంబాయి ప్రజా ఉద్యమాలెన్నిటిలోనో పాల్గొన్న వ్యక్తిగా ఆయన సుప్రసిద్ధుడు. ఆ సంఘం నడిపిన కలమ్ అనే మాసపత్రిక సంపాదకవర్గంలో ఉండిన గురుబీర్ సింగ్, 1980ల చివరిలో ఎకనమిక్ టైమ్స్ లో రిపోర్టర్ గా చేరి, గడిచిన నాలుగున్నర దశాబ్దాలలో బొంబాయిలో అనేక పత్రికలలో పనిచేశారు. ఒకవైపు పత్రికారంగంలో కీలకమైన వ్యక్తిగా ఉంటూనే, బొంబాయిలో రియల్ ఎస్టేట్ మాఫియా కోసం పేదల ఇళ్లు కూలగొట్టే ప్రభుత్వ విధానాలు మొదలయినప్పుడు వాటిని తీవ్రంగా ఖండించి సినిమా నటి షబానా ఆజ్మీ, నగర నిర్మాణ శాస్త్రవేత్త పి కె దాస్ లతో కలిసి నివారా హక్ అనే స్వచ్ఛంద సంస్థను నిర్మించడంలో, మూడు దశాబ్దాలకు పైగా విజయవంతంగా నిర్వాసితుల సేవా కార్యక్రమాలు చేస్తుండడంలో కూడా ఆయన పేరు పొందారు.

అటువంటి సీనియర్ జర్నలిస్టుకు ప్రస్తుత బొంబాయి ప్రెస్ క్లబ్ కార్యదర్శి మయూరేష్ గణపతయే కొద్ది రోజుల కింద ఒక షో కాజ్ నోటీసు పంపారు. "కొందరు వ్యక్తులు క్లబ్ ఆవరణలోకి రావడానికి, కొద్దిసేపు గడపడానికి మీరు ఏర్పాట్లు చేశారని ఆరోపణ వచ్చింది. ఆ వ్యక్తుల ఉనికి వల్ల మన సంస్థ గౌరవ ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే అవకాశం ఉంది. తీవ్రమైన క్రిమినల్ నేరారోపణలు ఎదుర్కొంటున్న అటువంటి వ్యక్తులతో ప్రెస్ క్లబ్ కు సంబంధం ఉన్నదని అనుమానించడానికి ఆస్కారం ఇచ్చే పని మీరు చేశారని అనిపిస్తున్నది. తద్వారా ప్రెస్ క్లబ్ గురించి ప్రతికూల ప్రచారం జరగడానికి, ప్రెస్ క్లబ్ ప్రాంగణాన్ని దాని ప్రకటిత లక్ష్యాలకూ, ప్రతిష్ఠకూ సరిపోలని పద్ధతిలో ఉపయోగిస్తున్నారని అనుకోవడానికి ఆస్కారం వచ్చింది" అని రాసిన ఆ నోటీసు, ఆ కారణం వల్ల ఆ సీనియర్ సభ్యుడి మీద, ఎన్నోసార్లు ప్రెసిడెంట్ గా, చైర్మన్ గా, ఆ పదవి వల్ల ప్రెస్ కమిషన్ ఆఫ్ ఇండియాలో కూడా సభ్యుడిగా ఉండిన సుప్రసిద్ధ జర్నలిస్టు మీద ఎందుకు చర్య తీసుకోగూడదో సంజాయిషీ ఇవ్వాలని రాసింది.

ఈ షోకాజ్ నోటీసు బొంబాయి పత్రికాలోకంలో సంచలనంగా మారి, ఎందరో సీనియర్ జర్నలిస్టులు ఖండించిన తర్వాత, ఒక పత్రిక అడిగిన ప్రశ్నకు జవాబు ఇస్తూ కార్యదర్శి గణపతయే, తమకు ఒక ఫిర్యాదు వచ్చిందని, ఆ ఫిర్యాదును పరిష్కరించడం కోసం జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ నోటీసు ఇచ్చామని అన్నారు. ప్రెస్ క్లబ్ ఎత్తిచూపిన ఆత్మీయ సమావేశంలో తాను పాల్గొన్నానని, కాని అది తాను ఏర్పాటు చేసినది కాదని గురుబీర్ సింగ్ అన్నారు.


ఫిర్యాదు ఎవరు చేశారో గణపతయే చెప్పలేదు గాని, ఎవరు చేశారో ఎవరైనా ఊహించగలరు. ఇంతకూ, జర్నలిస్టులకు మిత్రులైనవారు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ప్రవేశించడం, కాసేపు కూచుని మాట్లాడుకుని, ఏదైనా ఉపాహారం తిని, టీ, కాఫీ తాగి వెళ్లడం సర్వసాధారణం. సాయంత్రాలైతే అక్కడ జరిగే మిత్ర సమావేశాలలో మద్యపానం కూడా ఉంటుంది. అలా దేశంలోని అన్ని ప్రెస్ క్లబ్ లలో ప్రతి రోజూ కొన్ని వందల మంది జర్నలిస్టులు, వారి మిత్రులు కలుసుకుంటూ ఉంటారు. ప్రెస్ క్లబ్ లలో సభా మందిరాలు కూడా ఉంటాయి. వాటిని ఎవరికైనా అద్దెకు ఇస్తారు. ఈ బొంబాయి ప్రెస్ క్లబ్ లోనే ఇప్పుడు ఎవరి రాక గురించి అభ్యంతరం చెప్పారో, వారిలో ఇద్దరి పుస్తకావిష్కరణ సభలు కూడా జరిగాయి.

ఈ షోకాజ్ నోటీసులో స్పష్టంగా పేర్లు రాయలేదు గాని, ప్రెస్ క్లబ్ ను "అప్రతిష్ఠ పాలు చేసే అభ్యంతరకర వ్యక్తులు" అని కార్యదర్శి ఎవరి గురించి అన్నారో బొంబాయి జర్నలిస్టు లోకంలో ఇప్పుడు అందరికీ తెలుసు. వారు కుఖ్యాత భీమా కోరేగాం కేసు నిందితులు! ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖా, సుధా భరద్వాజ్, వరవరరావు, వర్నన్ గోంజాల్వేస్, అరుణ్ ఫరేరా, సుధీర్ ధావ్లే వంటి వారు. గౌతమ్ నవ్లాఖా మీద ఇంతకాలం ఉండిన 'బొంబాయి వీడిపోగూడద'నే బెయిల్ షరతు సడలించి, ఆయన స్వస్థలమైన ఢిల్లీకి వెళ్లవచ్చునని బొంబాయి హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత, ఆయన సహ నిందితులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, బొంబాయి స్నేహితులు వీడ్కోలుగా ఒక చిన్న టీ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. నిజానికి ఆయన కూడా ఒకప్పుడు బొంబాయిలో జర్నలిస్టే. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సహాయ సంపాదకుడుగా పని చేశారు. అదే పత్రికలో సహాయ సంపాదకుడుగా పని చేసిన మరొక సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ క్లబ్ సభ్యుడు బర్నార్డ్ డి మెల్లో మిత్రులుగా వారు అక్కడికి వెళ్లారు.

నిజానికి వారెవరూ నేరస్తులు కారు. నేరారోపణకు గురైన వ్యక్తులు మాత్రమే. "నేరస్తుడుగా రుజువయ్యేవరకూ నిందితులను అమాయకులుగానే పరిగణించాలి" అనేది భారతదేశంలో అమలయ్యే న్యాయ తాత్వికత. ఆ రుజువు కూడ "చట్టం నిర్దేశించిన పద్ధతిలో, సహేతుకమైన సందేహాలకు తావు లేని రీతిలో" సంపూర్ణమైన సాక్ష్యాధారాలతో జరగాలని చట్టం నిర్దేశిస్తుంది. భీమా కోరేగాం కేసులో ఎంతో తీవ్రమైన నేరారోపణలు ఉన్నప్పటికీ వాటి విచారణే ప్రారంభం కాలేదు. సాక్ష్యాధారాల సమర్పణే జరగలేదు. సహేతుకమైన సందేహాలకు తావు ఉండడం మాత్రమే కాదు, కొట్టవచ్చినట్టు కనబడే అబద్ధాలు, తప్పుడు వ్యాఖ్యానాలు, సాక్ష్యాధారాలను దొంగతనంగా నిందితుల కంప్యూటర్లలో చొరబెట్టిన ఆధారాలు అనేకం జరిగాయని ఈ ఎనిమిది సంవత్సరాలలో అనేకసార్లు బైటపడింది. అటువంటి వ్యక్తులు ఒక స్థలానికి వస్తే ఆ స్థలానికి అప్రతిష్ఠ కలుగుతుందని ఎవరో ఫిర్యాదు చేయడం, దానికి స్పందనగా ప్రెస్ క్లబ్ కార్యదర్శి షో కాజ్ నోటీసు ఇవ్వడం, సరిగ్గా హిట్లర్ జర్మనీలో యూదుల మీద జరిగిన వేధింపులను, మేధావులను అస్పృశ్యులుగా చూపడాన్ని గుర్తుకు తెస్తున్నది.

ఇక్కడ ఇంకొక రెండు ఆలోచించవలసిన సంగతులు కూడా ఉన్నాయి. ఒకటి, ప్రెస్ క్లబ్ లలో, అది బొంబాయి ప్రెస్ క్లబ్ గాని, దేశంలో మరేదైనా ప్రెస్ క్లబ్ గాని, లోపల ప్రవేశిస్తున్నవారు ఎవరో, వారి పూర్వాపరాలేమిటో, వారి మీద ఎన్ని కేసులలో ఎన్ని ఆరోపణలున్నాయో కనిపెట్టి వారిని ఆపగలిగే యంత్రాంగం ఏమన్నా ఉందా? ప్రతిరోజూ రాజకీయ నాయకులు, ఇతరులు ప్రెస్ క్లబ్ లో పత్రికా సమావేశాలు ఏర్పాటు చేస్తుంటారు. వారు ఎంత నేరస్తులో, వారి మీద ఎన్ని కేసులున్నాయో పత్రికల వారికి తెలియదా? ప్రెస్ క్లబ్ నిర్వాహకులకు తెలియదా? నిజానికి ఎవరి మీదనైనా పోలీసులు కేసు పెడితే, అది అబద్ధపు కేసు అని తమ స్పందన వినిపించడానికి కూడా ప్రెస్ క్లబ్ వేదిక ఇస్తుంది, ఇవ్వాలి. ప్రెస్ క్లబ్ పాత్రికేయులకు తమ సమాచార వనరులను కలుసుకునే చోటు. ఆ సమాచార వనరులు ఎటువంటివారు అని న్యాయనిర్ణేతల స్థానంలో కూచునే హక్కు పాత్రికేయులకూ లేదు, ఆ స్థలం ఇచ్చే నిర్వాహకులకూ లేదు. రెండు, ఆరోపణలు మాత్రమే కాదు, రేప్, బాలికల మీద అత్యాచారం, దేశదేశాల రాజకీయ నాయకులకు, సంపన్నులకు తార్పుడు పని వంటి అనేక నేరాల మీద విచారణ జరిగి, నేరం రుజువై, శిక్ష పడి, శిక్ష అనుభవించిన కరుడుగట్టిన నేరస్తుడు జెఫ్రీ ఎప్ స్టీన్ ను ప్రధాని నరేంద్ర మోడీ తరఫున అనిల్ అంబానీ కలిశాడని, ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడని తిరుగులేని ఆధారాలు బైటపడ్డాయి. నరేంద్ర మోడీ మంత్రివర్గ సహచరుడు హర్దీప్ సింగ్ పూరీ కూడా ఎప్ స్టీన్ ను లెక్కలేనన్ని సార్లు కలిశాడని, ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడని ఆధారాలు బైటపడ్డాయి. నరేంద్ర మోడీని, అనిల్ అంబానీని, హర్దీప్ సింగ్ పూరీని రక్షించడానికి సంఘ్ పరివార్ ట్రోల్ సైన్యం ఓవర్ టైమ్ పని చేస్తున్నది.

నేరస్తులతో కలిసిన వారినేమో ప్రేమతో రక్షించడం, కేవలం దురుద్దేశాలతో నేరారోపణలకు గురైనవారికి కాసేపటి కోసం స్థలం ఇస్తే అసహనంతో వేధించడం -- ఇదీ సంఘ్ పరివార్ ద్వంద్వ స్వభావం. ఇది ఫాసిజంలో అంతర్భాగం.



**ఎన్ వేణుగోపాల్**
ఎడిటర్, వీక్షణం

## 'తమ్మినేని' ప్రయోగాలు సరే..
# పార్టీ గోప్యత సంగతేంటి..?

భారతదేశ రాజకీయ పటంలో కమ్యూనిస్టు పార్టీలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సిద్ధాంతం, క్రమశిక్షణ, అంతర్గత గోప్యత అనే మూడు స్తంభాల మీద ఈ పార్టీల నిర్మాణం ఆధారపడి ఉంటుందనేది ఒక సూత్రం. అయితే, మారుతున్న కాలంతో పాటు తెలంగాణ సీపీఎంలో వస్తున్న మార్పులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హయాంలో పార్టీ ప్రదర్శించిన అంశాలపై చర్చ జరుగుతోంది. తమ్మినేనితో పాటు మరో ఇద్దరిపై 'అభిశంసన' తీర్మానం చర్చకు తెరలేపింది. అయితే 'అభిశంసన' చర్యలు ఒకభాగమైతే, ఈ పరిణామక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హయాంలో జరిగిన ప్రయోగాలు ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన కమిటీ బాధ్యత, సడలుతున్న పార్టీ గోప్యతపై ఇప్పుడు అసలైన చర్చ జరగాల్సి ఉంది.

కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం ప్రకారం ఏ సెక్రెటరీ కూడా ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకోలేరు. రాష్ట్ర సెక్రెటరీ సారధ్యంలో ప్రవేశపెట్టిన ప్రతి వ్యూహం వెనుక రాష్ట్ర కమిటీ, రాష్ట్ర కార్యవర్గాల ఆమోదం ఉంటుంది. ఈ లెక్కన ఒకవేళ ఆ ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోతే లేదా రాజకీయంగా దెబ్బతీస్తే, దానికి కేవలం అప్పుడు కార్యదర్శిగా ఉన్న తమ్మినేనిని మాత్రమే బాధ్యుడిని చేయడం సమంజసం ఎలా అవుతుంది..? 'అభిశంసన' చర్చ సాగుతున్న ఈ పరిస్థితుల్లో ఆ నిర్ణయాలు తీసుకున్నప్పుడు కమిటీలో ఉన్న ఇతర సీనియర్ నేతలు ఏం చేశారు..? అనేది ఇప్పుడు కేడర్‌లో, కమ్యూనిస్ట్ అభిమానులు, సానుభూతి పరుల్లో ఎదురవుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. నిర్ణయం సరైనది కానప్పుడు అడ్డుకోని నేతలు, ఇప్పుడు అది విఫలమయ్యాక 'అభిశంసన' ప్రక్రియను ముందుకు తేవడం 'సమిష్టి బాధ్యత' అనే సిద్ధాంతానికి విరుద్ధం కాకుండా ఏమవుతుంది..?

సాధారణంగా కమ్యూనిస్టు పార్టీలు ఒక నిర్దిష్ట చట్రంలో, పాతకాలపు ఎత్తుగడలతో సాగుతాయనే విమర్శ ఉంటుంది. కానీ తమ్మినేని వీరభద్రం దీనికి భిన్నంగా తనదైన 'డైనమిక్' నాయకత్వాన్ని ప్రదర్శించారనే చెప్పాలి. కేవలం ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా 'సామాజిక న్యాయం' అనే నినాదాన్ని ఎత్తుకోవడం తమ్మినేని చేసిన అతిపెద్ద ప్రయోగం. మహాజన పాదయాత్ర ద్వారా కుల సంఘాలను, దళిత, బహుజన శక్తులను ఎర్రజెండాతో అనుసంధానించడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారనేది కూడా మరువొద్దు. సంప్రదాయ పొత్తులకు భిన్నంగా, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (దీూఫీ) వంటి సరికొత్త ప్రయోగాలు చేయడం ద్వారా పార్టీకి కొత్త వర్గాలను పరిచయం చేసే ప్రయత్నం జరిగింది. ఇది పార్టీ క్యాడర్‌లో ఒకరకమైన చలనాన్ని తీసుకువచ్చిందని అప్పట్లో చర్చలు జరిగాయి. దళిత, బహుజన సమస్యలను పార్టీ ప్రధాన ఎజెండాలోకి తెచ్చారు. గతంలో కేవలం "కూలీ, నాలి" సమస్యలకే పరిమితమైన ఎర్రజెండా, ఆత్మగౌరవ పోరాటాలకు కూడా వేదికైంది. 5 నెలల పాటు సాగిన తమ్మినేని యాత్ర సిపిఎంకు ఒక కొత్త 'మాస్ అప్పీల్' ఇచ్చింది. తమ్మినేని ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, ఒక సామాజిక కార్యకర్తగా ప్రజల్లోకి వెళ్లడం పార్టీ ఇమేజ్‌ను మార్చింది. ఇది ఆయన తీసుకున్న అత్యంత డైనమిక్ నిర్ణయం. అయితే కారణాలు ఏమైనప్పటికీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కాలక్రమేనా సీపీఎం ఉనికి తగ్గుకుంటూ వచ్చింది. దీంతో ప్రయోగాలు ఫలితాలు ఇవ్వనప్పుడు కాలం గడిచాక సమీక్షించటం వల్ల ఏం ప్రయోజనం..? ఆ నిర్ణయాలు అప్పటి కార్యవర్గం ఆమోదించకుండానే, కేంద్ర కమిటి నాయకత్వానికి తెలియకుండానే అమలు జరిగాయా..? అనేది ఆలోచించాల్సిన అంశంగా చూడక తప్పదు.

ఇక మరో అంశం ఏంటంటే సిపిఎంకు ఉన్న అతిపెద్ద బలం దాని అంతర్గత చర్చల గోప్యత. కానీ ఇటీవల కాలంలో ఈ 'ఇనుప కవచం' ముక్కలవుతోంది. సమావేశం లోపల నేతల మధ్య జరిగిన వాదోపవాదాలు, విమర్శలు యథాతథంగా మీడియాకు చేరడం వెనుక పెద్ద వ్యూహమే కనిపిస్తోంది. పార్టీలో తమ పట్టు నిలుపుకోవడానికి లేదా ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టడానికి కొందరు నేతలే ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని బయటకు పంపుతున్నారా..? అన్నది ఇప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న చర్చ. కమ్యూనిస్టు పార్టీ అంటే క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా భావన ఉంటుంది. కానీ ఇప్పుడు సాధారణ రాజకీయ పార్టీల వలె లోపలి విషయాలు రచ్చకెక్కడం వల్ల సామాన్య కార్యకర్తల్లో నైతిక స్థైర్యం దెబ్బతింటోందనే స్పృహ అగ్రనేతలు మరిచారేమో అన్నట్లుగా వ్యవహారం సాగుతున్నది. ఒక నిర్ణయం తప్పని తెలిసినప్పుడు కమిటీలో వ్యతిరేకించకుండా, ఒక వేల వ్యతిరేకించినప్పటికీ చర్చలు జరిగి చివరికి ఆమోదం పొందిన నిర్ణయాలను ఆ తర్వాత ఆ నిర్ణయాల ఫలితం ఇవ్వలేదని భావించినప్పుడు ఆ తప్పును కేవలం వ్యక్తి మీదకు నెట్టివేసి తప్పుకోవాలని చూడటం సంస్థాగత బలహీనతను కూడా సూచిస్తుంది.

మరో అంశం ఏంటంటే కమ్యూనిస్టు పార్టీలలో 'డెమోక్రటిక్ సెంట్రలిజం' (ప్రజాస్వామ్య కేంద్రకత) అత్యంత కీలకం. అంటే, చర్చలు నాలుగు గోడల మధ్య లోపల జరగాలి, నిర్ణయం మాత్రమే బయటకు రావాలి. కానీ, సిపిఎం అంతర్గత సమావేశాల్లో జరిగే సుదీర్ఘ చర్చలు, విమర్శలు, ప్రతివిమర్శలు యథాతథంగా మీడియాకు చేరడం విస్మయానికి గురిచేస్తోంది. సమావేశం ముగియక ముందే "ఎవరు ఎవరిని నిలదీశారు?", "ఎవరిపై వేటు పడబోతోంది..?" వంటి సమాచారం నిమిషాల వ్యవధిలో స్క్రోలింగ్‌లలో కనిపిస్తోంది. పార్టీ ప్రయోజనాల కంటే తమ వ్యక్తిగత అజెండాలను లేదా గ్రూపు రాజకీయాలను నెగ్గించుకోవడానికి కొందరు నేతలే ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని మీడియాకు ఇస్తున్నారా..? అనే సందేహాలు కూడా సహజంగానే కలుగుతున్నాయి. సోషల్ మీడియా యుగంలో రహస్యాలను దాచడం కష్టమైనప్పటికీ, కమ్యూనిస్టు కేడర్ ఆ స్థాయికి దిగజారడం ఆందోళనకరం. అయితే పార్టీ లోపల జరిగే చర్చలు మీడియాకు లీక్ అవ్వడం వెనుక రెండు కారణాలు ఉండవచ్చు ఒకటి, తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లి హైకమాండ్‌పై ఒత్తిడి తేవడం. రెండు, ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీయడం. ఈ రెండు ధోరణులు ఎవరు అనుసరించినా కమ్యూనిస్టు క్రమశిక్షణకు గొడ్డలి పెట్టు. ఆ పార్టీకి అప్రతిష్ఠ. ఇలాంటి స్థితిని నిబద్ధతతో సమీక్షించుకొని దిద్దుబాటు చేసుకుంటారా లేదా అనేది ఆ పార్టీ అగ్ర నాయకత్వమే తేల్చుకోవాల్సిన అంశం.

**రాజేందర్ దామెర (దారా)**
సీనియర్ జర్నలిస్ట్
rajenderdamera@mail.com

# మహిళల శక్తి - సమాజ ప్రగతికి మార్గదర్శకం

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా**

(విద్య, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న నేటి మహిళలు) ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా జరుపుకుంటారు. మహిళల హక్కులు, సమానత్వం మరియు సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గుర్తించి గౌరవించేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళల సాధికారత, సమాన అవకాశాలు మరియు గౌరవప్రదమైన స్థానం కోసం జరిగిన పోరాటానికి గుర్తుగా ఈ దినోత్సవం కొనసాగుతోంది. మహిళ అనేది కేవలం కుటుంబాన్ని నడిపించే వ్యక్తి మాత్రమే కాదు; ఆమె సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి. ఒక కుటుంబంలో తల్లి, చెల్లెలు, భార్య, కుమార్తెగా అనేక పాత్రలను పోషిస్తూ కుటుంబాన్ని సక్రమంగా నడిపించే బాధ్యతను తీసుకుంటుంది. అదే సమయంలో విద్య, వైద్యం, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక రంగం, క్రీడలు, రాజకీయాలు, వ్యాపార రంగాల్లోనూ మహిళలు విశేష ప్రతిభను కనబరుస్తున్నారు.

చరిత్రను పరిశీలిస్తే మహిళలు ఎన్నో సవాళ్లు, వివక్షలు ఎదుర్కొన్నప్పటికీ తమ ప్రతిభతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఒకప్పుడు మహిళలకు విద్య, ఉద్యోగం వంటి అవకాశాలు చాలా పరిమితంగా ఉండేవి. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారాయి. నేడు మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తూ, దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారు. మహిళలు స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో కూడా ముందుకు వచ్చి ఆర్థికంగా స్వావలంబన సాధిస్తున్నారు.

భారతదేశంలో అనేక మంది మహిళలు తమ కృషితో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. భారతదేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా సేవలందించిన ఇందిరా గాంధీ దేశ రాజకీయాల్లో మహిళల నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారు. భారతదేశంలో తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందిన కిరణ్ బేడీ మహిళల ధైర్యానికి, న్యాయస్ఫూర్తికి చిహ్నంగా నిలిచారు. బాక్సింగ్లో ఐదు సార్లు ప్రపంచ ఛాంపియన్గా నిలిచిన మేరీ కోమ్ మహిళల ధైర్యం, పట్టుదలకు ప్రతీకగా నిలిచారు. మహిళా విద్యకు మార్గదర్శకురాలు

భారతదేశంలో బాలికల విద్యకు పునాది వేసిన సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే మహిళా సాధికారతకు ఒక గొప్ప ఉదాహరణ. అంతరిక్ష రంగంలో విశిష్ట స్థానం సంపాదించిన కల్పనా చావ్లా ప్రపంచవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె సాధన మహిళలు విజ్ఞాన శాస్త్రంలో కూడా అద్భుతాలు చేయగలరని నిరూపించింది. ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాపార రంగంలో ప్రముఖ స్థానం సంపాదించిన ఇంద్ర నోయి భారత మహిళల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పారు. అంతరిక్ష మిషన్లలో కీలక పాత్ర పోషించిన ౹వ౦౦౦ఎ థామస్ "మిసైల్ ఉమెన్ ఆఫ్ ఇండియా"గా ప్రసిద్ధి పొందారు. భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిన మహా శ్వేతా దేవి సమాజంలోని అణగారిన వర్గాల కోసం తన రచనల ద్వారా గొప్ప సేవ చేశారు.

బంగారం, వజ్రాలు కాదు... నిజమైన అందం ఆమె ధైర్యం, ఆత్మవిశ్వాసం. ఒక మహిళ తనపై నమ్మకం ఉంచుకుంటే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించగలదు.

ఇప్పటి యువ మహిళలకు అవకాశాలు విస్తారంగా ఉన్నాయి. సాంకేతిక విజ్ఞానం, స్టార్టప్లు, పరిశోధన, కళలు, క్రీడలు–ఎక్కడ చూసినా మహిళల ప్రతిభ కనిపిస్తోంది. అందుకే యువతులు పెద్ద కలలు కనాలి. కలలు కనడమే కాదు వాటిని నిజం చేయడానికి కృషి చేయాలి.

"ధైర్యంగా ముందడుగు వేసే మహిళే విజయాన్ని అందుకుంటుంది."

సమాజం కొన్నిసార్లు అడ్డంకులు సృష్టించవచ్చు. కానీ పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉంటే విజయం తప్పదు. యువ మహిళలు తమ లక్ష్యాల కోసం పోరాడాలి.

మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధిస్తుంది కాబట్టి నేటి యువ మహిళలు తమ ప్రతిభను విశ్వసించి ముందుకు సాగాలి. చదువు, ఆత్మవిశ్వాసం, కష్టపడి పని చేసే స్వభావం ఉంటే వారు ప్రపంచాన్ని మార్చగలరు.నీవు బలంగా ఉంటే ప్రపంచం నీకు దారి ఇస్తుంది." మహిళలు బలంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుంది. కుటుంబం బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది. అదే నిజమైన మహిళా సాధికారత.

**డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి,**
లైబ్రేరియన్ కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్,
వరంగల్. 9849375829

# నాయకుల నాయకుడు 'కొల్లూరి చిరంజీవి'

**తెలుగు నేల మీద పురుడు పోసుకున్న మూడు మహా ఉద్యమాలకు వ్యవస్థాపక నాయకుడు డా.కొల్లూరి చిరంజీవి. ఆరు దశాబ్దాల ఉద్యమ చైతన్యం ఆయన. ఆఖరి శ్వాస దాకా పేదల ఆకలి కన్నీటి విముక్తే ధ్యేయంగా బ్రతికిన ప్రజానాయకుడు డా.కొల్లూరి. ఏ నాయకుడికైనా ఒకటో రెండో ఉద్యమాలతో అనుబంధం ఉంటుంది. కొల్లూరికి మాత్రం అనేక ఉద్యమాలు, పోరాటాలతో విడదీయరాని అనుబంధం ఉంది. తొలితరం అనే మాటకు నిలువెత్తు రూపంగా జీవించిన మరపురాని వ్యక్తి. తరమెల్లిపోతున్నదని ఈ తరం తలచుకునే వ్యక్తుల్లో డా.కొల్లూరి ముఖ్యుడు. ఆయన ప్రస్థానాన్ని, అలుపెరుగని కార్యచరణను తలుచుకుంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన నిబద్ధతకు చేతులెత్తి జేజేలు చెప్పాలనిపిస్తది. అట్లా ప్రజల కోసం పరితపించిన నిస్వార్థ, నిష్కల్మష హృదయం డా.కొల్లూరి.**

సాంస్కృతికంగా, రాజకీయంగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉద్యమాల గడ్డ వరంగలే కొల్లూరిని కన్నది. తల్లిదండ్రులు ఇద్దరూ ఏ ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించిన అరుదైన దళిత దంపతులు. తల్లిదండ్రుల నుండి చిన్ననాడే సేవా దృక్పథాన్ని అలవర్చుకున్నాడు కొల్లూరి. తల్లి క్రైస్తవ కథలు చెప్పినా, తాను మాత్రం ఆధ్యాత్మిక చింతనకు కాకుండా సామాజిక చింతనకు చేరువయ్యాడు. విద్యార్థి దశలోనే ఉద్యమాల బాట పట్టాడు. తెలంగాణ తొలిదశ ఉద్యమకాలమైన 1969లోనే కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల ముఖ్యనేతగా పని చేశాడు. ఎమర్జెన్సీ కాలంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. ఎంబీబీయస్ పూర్తి చేసి వైద్య వృత్తిలోకి అడుగుపెట్టినా ఎక్కువకాలం అందులో ఉండలేకపోయాడు. తన చుట్టూ ఉన్న సమాజంలో అసమానతలు, అవమానాలు తనను కుదురుగా ఉండనివ్వలేకపోయాయి. అందుకే సామాజిక న్యాయం జరిగినపుడే తన జీవితానికి సార్థకత అని భావించి వైద్య వృత్తిని వదిలేశాడు. ఆ కాలంలోనే కులాంతర వివాహం చేసుకొని అనేకమందికి ఆదర్శనాయకునిగా నిలిచారు. సరిగ్గా అదే సమయంలో తనలోని సంఘర్షణకు విప్లవమార్గమే సరైనదని నమ్మారు. అట్లా పీపుల్స్‌వార్ పార్టీ తొలితరం నాయకుల్లో ఒకరిగా విప్లవోద్యమానికి పునాదులు వేశారు. ఆ ప్రయాణంలో కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య, శివసాగర్ వంటి ఎందరో అగ్రనేతలతో కలిసి పని చేశారు. డా.కొల్లూరి మొదటి నుండి బహుముఖ మార్గాల్లో కృషి చేశారు. క్యాడర్‌ను తయారు చేసుకోవాలంటే ముందు నాయకులు కావాలన్నాడు. నాయకత్వానికి శిక్షణా కార్యక్రమాలు పెడితే తాను ప్రపంచ విప్లవోద్యమాల అనుభవాలను ఒక క్లాసుగా బోధించేవాడు. అట్లా తన క్లాసులు విని కేంద్రకమిటీ స్థాయికి ఎదిగిన నాయకులు ఎందరో ఉన్నారు. అది డా.కొల్లూరి మేధోకృషికి మాత్రమే సాధ్యపడిన విషయం. దళితుడైన డా.కొల్లూరి విప్లవోద్యమంలో ఎక్కువకాలం కొనసాగలేకపోవడం చాలా సహజమైన విషయం. అట్లా 1977లో విప్లవోద్యమం నుండి బయటికి వచ్చాడు. అయినా తన సామాజిక బాధ్యతను మాత్రం విస్మరించలేదు.

ఈ దేశంలో విప్లవం ఏ సమూహాలకు అవసరమో కనుగొన్నాడు. నూటికి ఎనభై శాతంగా ఉన్నా బహుజనుల కష్టాలకు మూలాలను అన్వేషించాడు. కులాన్ని మరిచి నిర్మించే వర్గపోరాటాల వల్ల ఫలితం లేదనుకున్నాడు. అదే సమయంలో ఉత్తరప్రదేశ్ కేంద్రంగా ఉప్పెనలా వచ్చిన బహుజన సమాజపార్టీ(బీఎస్పీ) నిర్మాణ పని పద్ధతులు కొల్లూరిని ఆకర్షించాయి. ముఖ్యంగా మాన్యవర్ కాన్షీరాం ఆలోచనాధోరణి, కార్యదీక్షతలు తనకు బాగా నచ్చాయి. అంబేద్కరిజమే ఈ దేశాన్ని విముక్తం చేస్తుందనే అవగాహనకు ఆ రోజుల్లోనే అంచనాకు వచ్చాడు. అట్లా బహుజనులను కూడగట్టి తెలుగునాట బహుజన సమాజ్ పార్టీ అడుగుపెట్టడంలో కీలక భూమికను పోషించాడు. కాన్షీరాం ఎప్పుడు హైదరాబాద్‌కు వచ్చినా డా.కొల్లూరితోనే ముఖ్యమైన నిర్ణయాలు చర్చించేవాడు. అట్లా బీఎస్పీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగిన అనేక కార్యక్రమాలకు డా.కొల్లూరి బహుజనుల జాతీయ నాయకునిగా పని చేశాడు. 'బహుజన' పత్రికకు ఎడిటర్‌గా పని చేశాడు. ఇట్లా రెండు ప్రధాన భావజాలాలకు సంబంధించిన సంఘ నిర్మాణాలలో కొల్లూరి ప్రత్యక్షంగా పాలుపంచుకోవడం ఒక చరిత్ర. ఇది చాలా తక్కువమంది నాయకులకు మాత్రమే దక్కిన అరుదైన అవకాశం.




తెలంగాణ రాష్ట్ర సాధనలో డా.కొల్లూరి పోషించిన పాత్ర అద్వితీయమైంది. తొలిదశలో అరవై తొమ్మిది ఉద్యమకారుల జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ప్రొ.జయశంకర్ కంటే ముందే తెలంగాణ రాష్ట్ర విముక్తి కావాలని గళమెత్తిన నాయకుడు కొల్లూరి. తెలంగాణ ప్రజలకు స్వతంత్ర అస్తిత్వముండాలని, నీళ్లు, నిధులు, ఉద్యోగాల్లో జరిగిన అన్యాయం దారుణమైందని వందలాది వేదికల మీద ఉపన్యసించాడు. ఈ ఆర్తి, ఆవేదన మలిదశలోను చల్లారింది లేదు. రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణ ఉనికిని, అస్తిత్వాన్ని తాకట్టు పెట్టొద్దని నినదించినవాడు. ఖరాఖండిగా ఎంతోమంది రాజకీయ నాయకులను నిర్మొహమాటంగా తిరస్కరించాడు. మలిదశలో తొలితరం నాయకులను కూడగట్టి ఎన్నో ప్రెస్‌మీట్‌లు పెట్టి ఉద్యమవేడి చల్లారకుండా కాపు కాశాడు. అట్లా తెలంగాణ రాష్ట్ర సాధన సుసాధ్యం కావడంలో క్రియాశీలకంగా పని చేశాడు. కొల్లూరి ఒక హైదరాబాదీగా ఇక్కడి చరిత్ర సంస్కృతి పట్ల ఎల్లప్పుడూ నిబద్ధతతో వ్యవహరించాడు. 'వాయిస్ ఆఫ్ హైదరాబాద్' అధ్యక్షులు కెప్టెన్ పాండురంగారెడ్డి వంటి నాయకులతో నిత్యం అనేక ఆలోచనలు పంచుకున్నాడు. ముఖ్యంగా హైదరాబాద్ ముస్లిం సమాజంతో, విద్యావంతులతో కలిసి పని చేశాడు. హైదరాబాద్ అస్తిత్వం ప్రమాదంలో పడే ప్రతీసారి 'సేవ్ హైదరాబాద్' అంటూ గర్జించాడు కొల్లూరి.

ఇక సామాజిక ఉద్యమాల్లో సైతం కొల్లూరి పోషించిన పాత్ర విస్మరించలేనిది. దళితుల్లో దగాపడిన సమూహాల కోసం కూడా బరిగీసి నిలబడిన సాహసం తనది. ఎమ్మార్పీఎస్ ఏర్పాటుకు ముందు జరిగిన అనేక చర్చల్లో స్వయంగా పాల్గొని దిశానిర్దేశం చేసిన పెద్దదిక్కు డా.కొల్లూరి. ఒక్క ఎమ్మార్పీఎస్‌తోనే కాదు సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు వచ్చిన అనేక సంఘాలకు, వేదికలకు వెన్నుదన్నుగా నిలిచాడు. తన వంతు పాత్రను బాధ్యతతో పోషించాడు. సాహిత్యంలో దండోరా గొంతుకను బలంగా వినిపించిన నాగప్పగారి సుందర్రాజు వంటి కవులు, రచయితలకు కొల్లూరి ఒక పథనిర్దేశకుడిగా నిలబడ్డారు. అక్షరాల విలువను తెలిసిన ఆలోచనాపరునిగా పదునైన సాహిత్యసృజనకు మార్గనిర్దేశనం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి తన ఇంటిని, ఆఫీసును కార్యశాలగా మార్చాడు. తెలంగాణ సాధనలో సాహిత్య సాంస్కృతిక రంగాల పాత్ర కీలకమని గుర్తించాడు.

డా.కొల్లూరి చనిపోయే సమయానికి కనీసం సొంత యిల్లు కూడా లేదు. అనారోగ్యానికి వైద్యం కూడా చేయించుకోలేని పరిస్థితి. ఇవాళ ఉద్యమాలను, పార్టీలను ఆధారంగా చేసుకొని కోట్లు కూడబెట్టుకునే స్వార్థపూరిత జమానే నడుస్తున్నది. ఇలాంటి కాలంలో విలువల మీద బతికి కడదాక ప్రజల కోసమే జీవించిన సిసలైన ప్రజానేత డా.కొల్లూరి. ఈ దేశంలో నిరుపేదలైన బహుజనుల విముక్తి కోసం తన ఏడుదశాబ్దాల జీవితాన్ని తృణప్రాయంగా ధారపోసిన మహా మనిషి కొల్లూరి. బహుజన రాజ్యాధికార సాధనే కాదు, అంతకంటే ముందు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో బహుజనుల వాటా వారికి దక్కాలన్న ఆయన ఆశయాన్ని సాధించడమే డా.కొల్లూరికి నిజమైన నివాళి. ఆ దిశగా బహుజనులు సమాయత్తం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఈ మహా నాయకుని కృషిని గుర్తించాలి. ఆయన పేరును శాశ్వతం చేయాలి.



**డా.పసునూరి రవీందర్**
77026 48825

# మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, మార్చి 7 (జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీమంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.శనివారం మహేశ్వరం మండలం అవేర్ లోని బీఈడీ,నార్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...మహిళలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థులకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అవేర్ ఎండీ తరుణ్,బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతురావు,నార్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నీలిమ,పలువురు లెక్చరర్లు,అవేర్ సంస్థ ప్రతినిధులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వాలకు మీడియా వారధిగా పనిచేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**అబ్దుల్లాపూర్‌మెట్టు, మార్చి 7 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పరిధిలోని ఆర్ఎన్ఆర్ కాలనీ-2లో ఉన్న సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం రోజు రావి నారాయణ రెడ్డి భూ పోరాట కేంద్రానికి సంబంధించిన సోషల్ మీడియా ఆక్టివిస్ట్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలతో పాటు మీడియా కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగిన నాలుగో స్థంభమని పేర్కొన్నారు. మీడియా ప్రజల సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధిగా పని చేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వాలు లేదా రాజకీయ



పార్టీలకు అనుకూలంగా సొంత పత్రికల మాదిరిగా వ్యవహరించకుండా వాస్తవాలను మాత్రమే ప్రజలకు చేరవేయాలని మీడియాను కోరారు. భూ పోరాట కేంద్రంలో వేలాది మంది ప్రజలు చిన్నపిల్లలతో కలిసి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, మీడియా క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజాలను మాత్రమే రాసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు.ప్రస్తుత కాలంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్రభావం కూడా ప్రజలపై విపరీతంగా ఉందని తెలిపారు. అందువల్ల సోషల్ మీడియాలో ఉన్న చెడును పక్కన పెట్టి మంచిని మాత్రమే స్వీకరించి, కొత్త విషయాలను తెలుసుకోవాలని అన్నారు. భూ పోరాటం గురించి దేశవ్యాప్తంగా తెలిసేలా సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మర్రి శ్రీమాన్ సోషల్ మీడియా నిర్వహణకు సంబంధించిన పలు నైపుణ్యాలను కార్యకర్తలకు వివరించారు. అలాగే భూ పోరాట కేంద్రానికి ప్రత్యేక సోషల్ మీడియా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా భూక్యా వినోద్ నాయక్, కో-కన్వీనర్లుగా అనిల్, అశోక్ యాదవ్‌లను ఎంపిక చేసి మొత్తం 20 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మధు, యాదగిరి, పేరాల గోపి, వీరేష్, షాలిని, నీలా, రేణుక, లలిత, చంటి, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన పట్టణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి

- చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి

**చేవెళ్ల, మార్చి 7 (జనంసాక్షి) :** పరిశుభ్రమైన పట్టణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి తెలిపారు. చేవెళ్ళ మునిసిపాలిటీ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ చైర్‌పర్సన్ సమతావెంకట్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం, వైస్ చైర్పర్సన్ రాములు గౌడ్, వార్డ్ కౌన్సిలర్లు, బండారి శైలజాఆగి రెడ్డి, దూత మల్లేష్, దప్పు సువర్ణ చందు లతో, కలిసి మున్సిపాలిటీ పరిధి లోని 1,2 వ వార్డులు మొండివాగు,ఉరేళ్ల ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ప్రజా పాలనలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించడానికి 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కు సంబంధించిన ప్రత్యేక అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ సిడీఎంఏ ఎన్.విశాల్ రాజ్ హాజరై పరిశీలించారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ సిబ్బంది వార్డులలోని పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజలతో కలిసి వీధులలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాలనీలలో పరిశుభ్రత పనులు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, తమ ఇళ్ల చుట్టుపక్కల శుభ్రతను కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమతావెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశుభ్రమైన పట్టణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి పొడి చెత్త వేరు చేసి డస్ట్‌బిన్‌లలో వేసి చెత్త తరలించే ఆటోలకు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలో శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రాఘవేందర్, పారిశుధ్య సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

- సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్
- సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీవోకు వినతి పత్రం

**సదాశివపేట, మార్చి 7 (జనం సాక్షి) :** పాత పద్ధతిలోనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సదాశివపేట సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ మాట్లాడుతూ సదాశివపేట మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం ఉన్న కొత్త హాజరు ప్రక్రియ ద్వారా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా హాజరు నమోదు చేయడంలో సర్వర్డౌన్ సమస్యలు, ఐరిస్, ఆధార్ అప్డేట్ లేకపోవడం సమస్యలు ఎదురవుతున్నాయని, హాజరు నమోదులో ఆలస్యం కారణంగా కార్మికులు సాయంత్రం 4 గంటల వరకు వేచి చూడాల్సి వస్తుందని అన్నారు. కార్మికుల సౌకర్యార్థం పాత పద్ధతిలో హాజరు విధానాన్ని కొనసాగించి,



పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా మహాత్మా గాంధీ పథకాన్ని 90 శాతం నిధులతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించేదని, ప్రస్తుత చట్టంలో 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలనే విధానాన్ని ఎత్తివేసి, కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బలరాం అనిత శ్రీనివాస్, కలాలి మోహన్ గౌడ్, గడీల ఆశి రెడ్డి, ఇందూరి భారతమ్మ బాబు, నాగులపల్లి విజయలక్ష్మి శివానంద్ గౌడ్,నవీన్, గొల్ల రాములమ్మ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో 'పిఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం



**శేరిలింగంపల్లి, మార్చి 7 (జనంసాక్షి) :** ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాలయం (ఎంఎస్ఎంఈ - డిఎఫ్ఓ), హైదరాబాద్ భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పిఎం విశ్వకర్మ కళాకారుల ప్రయోజనార్థం మూడు రోజుల విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ ను మార్చి 6 నుండి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లోని శిల్పరామం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విలేజ్, మాధాపూర్ లో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్ఎంఈ సంయుక్త సంచాలకులు సిఎస్ఎస్ రావు, సతీష్ రెడ్డి, ఆర్డిఎన్ఎస్డిసి సంయుక్త సంచాలకులు సురేష్ బాబు, ఎన్ఎస్ఐసి సమన్వయకర్త ఎస్.వి.దశరథ్ తదితరులు సంప్రదాయబద్ధంగా దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎం విశ్వకర్మ కళాకారులు పాల్గొన్నారు. ఈ ట్రేడ్ ఫెయిర్‌లో మొత్తం 50 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో వడ్రంగి పని (కార్పెంటరి), ఔసలి పని(గోల్డ్‌స్మిత్), కుండల తయారీ(పాటరీ), బుట్టల తయారీ పద్ధతి(బాస్కెట్ వీవింగ్), దర్జీ పని (టైలరింగ్), బొమ్మలు మరియు ఆట వస్తువుల తయారీ, పూలమాలల తయారీ వంటి సంప్రదాయ వృత్తులకు చెందిన పిఎం విశ్వకర్మ కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ద్వారా కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుల ప్రదర్శనకు పెట్టడం విశేషం. ఈ కార్యక్రమాన్ని ఎంఎస్ఎంఈ - డిఎఫ్ఓ హైదరాబాద్ సహాయ సంచాలకుడు ఎస్.వి. దశరథ్ పేతురుత్వంలో నిర్వహించడం జరుగుతుందని ట్రేడ్ ఫెయిర్ నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యోగులకు బదిలీలు సహజం

**జహీరాబాద్, మార్చి 7 (జనం సాక్షి) :** ఉద్యోగుల బదిలీలు సహజమే నని,తాము నిర్వహించిన విధులు మనకు గుర్తింపు నిస్తాయని అయన అన్నారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం మల్చల్మ తండా పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శికి తాండవాసులు ఘన వీడ్కోలు పలికారు. సర్పంచ్ కిషన్ చవాన్ అధ్యక్షతన శనివారం బదిలీ అయిన కార్యదర్శి విట్టల్ రెడ్డికి వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యదర్శికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అయన తాండకు అందించిన సేవలను సర్పంచ్ గుర్తు చేసారు. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, వృత్తి ధర్మంలో చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ఎక్కడైనా మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిషన్ చవాన్, ఉప సర్పంచ్ శీను



బానోత్, మాజీ సర్పంచ్ చందర్ చవాన్, సుభాష్ నాయక్, ఫూల్ సింగ్, గోపాల్ రాథోడ్, రవి పూజారి తదితరులు పాల్గొన్నారు.

# ఐలాండ్‌ను అందంగా మార్చేందుకు చర్యలు

**తాండూరు, మార్చి 7 (జనంసాక్షి) :** ఐలాండ్‌ను అందంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి పేర్కొన్నారు.పట్టణ నడిబొడ్డున ఇందిరా చౌరస్తాలో ఉన్న ఐలాండ్‌ను అందంగా మార్చేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. శనివారం పట్టణంలోని ఇందిరా చౌరస్తాలో ఉన్న



ఐలాండ్‌ను పరిశీలించారు. కమీషనర్ మధుసూదన్ రెడ్డితో కలిసి ఐలాండ్ పరిసరాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఐలాండ్ ప్రాంతాన్ని పరిశుభ్రపరించేందుకు ఆదేశించారు. పరిశుభ్రం పరిచిన తరువాత రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

## మద్యం సిండికేట్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి



**చేర్యాల, మార్చి 7 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలో ఉన్న మద్యం షాప్ యజమానులందరూ కలిసి ఒక సిండికేట్ మాఫియాగా ఏర్పడి మద్యం బాటిల్ కు ఎమ్మార్పీ ధరల కంటే పది శాతం ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. ఈ సిండికేట్ వ్యవస్థను వెంటనే రద్దు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేర్యాల మండల బిజెపి అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎక్సైజ్ ఎస్సై పి.సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్లకొండ సంజీవులు గౌడ్ మాట్లాడుతూ.. ఈ సిండికేట్ వ్యవస్థను తక్షణమే రద్దు చేసి, వైన్స్ షాప్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై చర్యలు తీసుకొని ఎడల ఎక్సైజ్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు, కొట్టే చంద్రమౌళి, మన్నె సత్య వర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు,నాయకులు మడికొండ శ్రీనివాసరావు, గోపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోతోజి చంద్రశేఖర్ చారి, మండల కార్యదర్శి రవి చారి,గంధాల సత్యనారాయణ,పట్టణ ప్రధాన కార్యదర్శి కలకుంట్ల మనీష్, బీజేవైఎం నాయకులు మాచర్ల ప్రవీణ్ గౌడ్, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్, బింగి శ్రీనివాస్,గుంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

# కక్షిదారులకు సత్వర న్యాయానికి అన్ని వసతులు

- నూతన కోర్టు భవన సముదాయాలు
- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ తెలిపారు.సిరిసిల్లలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో 12 రకాల న్యాయస్థానాలు సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు శైలిలో నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన లో పాల్గొనగా, సిరిసిల్లలో హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్వ మత ప్రార్థనలు చేసి.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం



ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నూతన కోర్టు భవన సముదాయం అన్ని కోర్టుల నిర్వహణకు సరిపోయే విధంగా ఉంటుందని వెల్లడించారు. నూతన కోర్టులో మౌలిక వసతులతోపాటు తగినంత సిబ్బంది ఉండాలని సూచించారు సిరిసిల్ల జిల్లాకు భౌగోళికంగా, పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయం జీవనోపాధితో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు.ఇక్కడ చేనేత పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి పొందింది అని పేర్కొన్నారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కోర్టులో 13 వేల కేసులు పైగా కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు. పెండింగ్ కేస్‌ల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంబంధిత అధికారులు సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు.ఈ నూతన కోర్టు భవన నిర్మాణం ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ పేర్కొన్నారు. రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి పౌరుడికి సామాజిక న్యాయం అందేలా న్యాయవ్యవస్థ పని చేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చరిత్ర, సంస్కృతి, పరిశ్రమలతో ప్రసిద్ధి పొందిన ప్రాంతం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ పేర్కొన్నారు పెద్ద టెక్స్టైల్ పవర్ లూమ్ కేంద్రంగా ఎదిగి వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు.సిరిసిల్లను పవర్‌లూమ్ నగరంగా కూడా పిలుస్తారనీ. ఇక్కడ వేలాది మంది నేత కార్మికులు పగలు రాత్రి శ్రమించి దేశవ్యాప్తంగా పేరు పొందిన వస్త్రాలను తయారు చేస్తున్నారని తెలిపారు. సిరిసిల్లలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రాలలో ఒకటి తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి




**రాజేంద్రనగర్, మార్చి 7 (జనంసాక్షి) :** పార్టీ బలోపేతం, కార్యకర్తల సమర్థత ప్రజలతో మరింత సమర్థవంతంగా పని చేయడం లక్ష్యంగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ పేర్కొన్నారు.శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత వ్యవస్థ బలోపేతం, బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల పాత్ర వంటి అంశాలపై నాయకులు అవగాహన కల్పించారు.అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ బీజేపీ అధ్యక్షులు మహేష్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు మహాలింగం, మల్లారెడ్డి, నరేష్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, ఎస్.మహేందర్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
08 మార్చి 2026

# విద్యతోనే మహిళాభ్యున్నతి



**● అదనపు కలెక్టర్ ఫణీందర్ రెడ్డి**

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** విద్యతోనే మహిళాభ్యున్నతి, మహిళా సాధికారిత సాధ్య మని, మహిళలు అవకా శాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో పురుషుల తో సమానంగా రాణించాలని నారాయణపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి సూచించారు. సరైన అవకాశాలు కల్పిస్తే అతివలు సమర్ధవంతంగా అనుకున్నది సాధిస్తారన్నారు. సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు,అవకాశాలు ఉండా లని ఆయన అభిప్రాయ పడ్డారు.జిల్లా మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన అంత ర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం,ఉపాధి అవకాశాల కోసం ఓఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబంలో మగ పిల్లలు ఎక్కువ ఆడ పిల్లలు తక్కువ అనే భేద భావం పోవాలని, మగ, ఆడ పిల్లలను సమాన దృష్టితోనే చూడాలని సూచించారు. మహిళలు ప్రధానంగా మూ డింటిపై నాలెడ్జ్ పెంచుకోవా లన్నారు.మహిళలు తమకు ఉన్న హక్కులపై, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటితో పాటు విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఏతల్లిదం డ్రులైన తమ పిల్లలకు ఇచ్చే గొప్ప వరం చదువే అని ఆయన స్పష్టం చేశారు. వేదికపై ఉన్న మహిళలు కూడా వాళ్ళ తల్లిదండ్రుల సహకారం ప్రోత్సాహంతోనే ఒక ఉన్నత స్థాయిలో ఉన్నా రన్నారు. చిన్న స్థాయి నుంచి దేశ స్థాయికి ఎదిగే అవకాశాన్నిఅందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ అందరికీ అంతర్జాతీయ మహిళా దినో త్సవ శుభాకాంక్షలు తెలిపా రు. కార్యక్రమంలో నారా యణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ మాట్లాడుతూ పురు షులతో సమానంగా మహిళ లు రాణించాలని అన్నారు. ఆర్థిక,రాజకీయ రంగాలలోనే కాకుండా ఎంచుకున్న ప్రతీ రంగంలో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. మక్తల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ వాకిటి మానస మాట్లాడు తూ సృష్టికి మూలం స్త్రీ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ గా గెలిచిన తనకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చైర్ పర్సన్ అవకాశం ఇస్తే అంత పెద్ద బాధ్యత నేను మోయగలనా అని మంత్రితో విన్నవించాననీ కానీ మంత్రి మాత్రం పురిటి నొప్పులనే తట్టుకున్న తల్లులకు ఇదేం పెద్ద బరువు కాదని హితవు చెప్పి తనను చైర్ పర్సన్ చేశారని ఈ సందర్భంగా వాకిటి మానస చెప్పారు. నిజానికి చెల్లిగా,తల్లిగా, భార్యగా, కోడలిగా ఎన్నో బాధ్యతలను నిర్వర్తించే మహిళలు ఏ రంగంలో నైనా రాణిస్తారని నమ్మకం తనకు వచ్చిందని ఆమె అభిప్రాయ పడ్డారు. అయితే ప్రస్తుత సమాజంలో భర్త, పిల్లలు అని కాకుండా ఉమ్మడి కుటుంబా నికి మహిళలు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డిని, డిఆర్డిఓ మొగులప్ప, ఆర్టీవో మేఘా గాంధీని డీడబ్ల్యుఓ రాజేందర్ గౌడ్ ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేసిన ఐసిడిఎస్ నారాయణపేట, మక్తల్ ప్రాజెక్టుల పరిధిలోని సిడిపిఓలు, ఏ సిడిపివోలు, సూపర్ వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది,కేస్ టేకర్లు, పోలీసు లను శాలువా, మెమెంటో తో సన్మానించారు. వీరితో పాటు నారాయణపేట, మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్లను, వైస్ చైర్ పర్సన్లను, వార్డు కౌన్సిలర్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీడబ్ల్యుసీ అశోక్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి, మహిళా కౌన్సిలర్లు కందన్ పల్లి సత్యమ్మ, జయశ్రీ, భాగ్యవతి, అరుణ,బండి రాజేశ్వరి, కల్పన రఘురామయ్య, శ్వేతా వెంకటేష్, డీడబ్ల్యుఓ కార్యాలయ ఉద్యోగులు సాయి, నర్సిములు, శైలజ, కరిష్మా, భారతి, సఖి సెంటర్ నిర్వాహకురాలు క్రాంతి రేఖ, అంగన్‌వాడీ టీచర్లు, పట్టణ మహిళా సంఘాల సభ్యులు, సెర్ఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ రంగంలో ఓబీసీలకు మరింత ప్రాధాన్యత కల్పించాలి

**● డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**



**మహబూబ్‌నగర్ బ్యూరో అర్బన్, మార్చి 7 (జనం సాక్షి) :** గ్రామస్థాయి నుంచి రాజకీయం, పరిపాలన వ్యవస్థలో ఓబీసీలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షుడు అనిల్ జైహింద్ ఆధ్వర్యంలో ఓబీసీ సముదాయాల సమస్యలపై కీలక సమావేశం జరిగింది. తెలంగాణలో ఓబీసీ సముదాయాల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు జరిగిన పురోగతి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ నిర్వహించారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో సంజీవ్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తున్నట్లు తెలిపారు. ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆలోచన విధానం మేరకు బడుగు, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం పనిచేద్దామని అన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో ఓబీసీ సెల్ ఇంచార్జ్ రుద్ర సంతోష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

**కొల్చారం, మార్చి 7 (జనం సాక్షి) :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్ చేసినట్లు కొల్చారం ఎస్సై అహ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు కొల్చారం పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పని చేస్తున్న లక్ష్మీ రెడ్డితో పాటుగా యు. కృష్ణ పిసి 3151, శంకర్ పిసి565 రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అర్ధరాత్రి సమయం 12:30 సమయంలో పోతంశెట్టిపల్లి ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా, ఒకటిప్పర్ ఇసుక లోడుతో మెదక్ వైపు నుండి కౌడిపల్లి వైపుకు వెళుతుండగా అట్టి టిప్పర్ను ఆపి ఇసుకకు సంబంధించిన సరైన పత్రాలు మరియు సరైన అనుమతులు చూపించమని కోరగా టిప్పర్ డ్రైవర్ దగ్గర ఇలాంటి ప్రభుత్వానికి సంబంధించినటువంటి కాగితాలు మరియు ఆధారాలు గాని చూపించలేదు. అట్టి టిప్పర్ డ్రైవర్ సంపంగి రాజు ఇలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మరియు దొంగతనంగా ఇసుకను రవాణా చేస్తున్నారని తెలుసుకొని అట్టి ఇసుకలోడున్న టిప్పర్ను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## నిమ్జ్ భూ నిర్వాసితులను ఆదుకోవాలని వినతి



**న్యాల్‌కల్, మార్చి 7 (జనం సాక్షి) :** దశాబ్దాల కాలంగా వ్యవసాయం, పశు పోషణ, వ్యవసాయ ఆధారిత పనులతో జీవనం సాగిస్తున్న వందలాది రైతులకు చెందిన భూములను ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం నిమ్జ్ పరిశ్రమల ఏర్పాటు కోసం భూములను లాక్కోవడం దారుణమని, అన్ని విధాలుగా నష్టపోయిన భూ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ పలువురు భూ నిర్వాసితులు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. న్యాల్ కల్ మండలం, ముంగి తాండాకు చెందిన పలువురు గిరిజన భూ నిర్వాసితులు శు క్రవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని ఫిర్యాదు విభాగంలో వినతి పత్రాన్ని అందజేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, పునరావాసం కల్పించాలని, ఎకరానికి రూ:15 లక్షల చొప్పున పరిహారం, ఇండ్ల నిర్మాణం కోసం 120 గజాల స్థలాన్ని కేటాయించాలని, అర్హత కలిగిన స్థానిక యువతకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, భూనిర్వాసితులకు సంబంధించిన వ్యవసాయ భూముల కేసు కోర్టులో కొనసాగుతున్నప్పటికీని ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం బలవంతంగా భూసేకరణ చేపట్టడం ఎంత మాత్రం సరికాదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పాండు రాథోడ్, సంతోష్, పలువురు భూ నిర్వాసితులు ఉన్నారు.

## ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్పీ రూల్స్ అమలు చేయాలి

**● పదవ తేదీన మహా ధర్నాకు రావాలి**



**తూప్రాన్, మార్చి 7 (జనం సాక్షి) :** విద్యుత్ సంస్థలో మీటర్ రీడలో ఎస్ పి ఎన్ పి ఏ గార్డెన్ సెక్యూరిటీ మరియు ఏపీ టీఎస్ విజిలెన్స్ తదితర విభాగాలలో పనిచేస్తున్న వారందరికీ జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ ఈపీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు 30 రోజుల పని దినాలను వర్తింపజేయాలని కొనసాగుతున్నరూ అని ఉమ్మడి మెదక్ జిల్లా టీవీఎస్ చేసి చైర్మన్ స్వామి తెలిపారు. గత ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు కానీ విద్యుత్ శాఖలోని కాంటాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా చేశామని చెప్పి ఒక కొత్త నామకరణము అనగా ఆర్టిజన్లుగా (కళాకారులుగా) కొత్త పేరు రూపొందించి వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ కార్మికులను అందరిని కూడా రెగ్యులరైజ్ చేస్తామని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు, కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుచుతున్న కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నదన్నట్టు ఏలాంటి మార్పు జరగలేద న్నారు.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం హయాంలో అయినా గాని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తింపు వస్తుందని ఆశతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. కానీ అటు యాజమాన్యం ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కావున విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు కూడా ఏకమై ఒక జేఏసీగా ఏర్పడి వచ్చే నెల మార్చి 10న హైదరాబాద్ టీజీఎస్పీడీసీఎల్ ఆఫీస్ ముందు మహాధర్నా పెట్టి అదే రోజు సమ్మె నోటీసు ఇవ్వాలని జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు ఇవ్వడం జరుగుతదని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు భారీ ఎత్తున ఈ యొక్క మహా ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జాకు కన్వీనర్ షాదుల్ హుస్సేన్, సోషల్ మీడియా కన్వీనర్ జిన్న నాగరాజు,డివిజన్ నాయకులు రాజ్ కుమార్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు మరమ్మత్తులపై నిర్లక్ష్యం సరికాదు



**పుల్కల్, మార్చి 7 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టు కు చేపట్టిన మరమ్మతులపై నిర్లక్ష్యం తగదని ఈఎన్సి జనరల్ రమేష్ బాబు ప్రాజెక్టు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఈఎన్సి బృందం ప్రాజెక్టును సందర్శించింది. అందులో భాగంగా అక్కడ నిర్వహిస్తున్న పనులపై ఈఎన్సి బృందం అసహనం వ్యక్తం చేసింది. 16 కోట్లతో చేపట్టిన పనులకు ఒకే మిషన్, ఒకే టిప్పర్ తో పనులు నిర్వహిస్తే మరమ్మత్తులు ఎప్పటి వరకు పూర్తవుతాయని ఇరిగేషన్ డి ఈ నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే మరో రెండు సంవత్సరాల వరకైనా మీరు పనులను పూర్తి చేయలేరు.ఇంత నిర్లక్ష్యం పనికిరాదు,వారం రోజుల్లో పనులను వేగవంతం చేయాలన్నారు.

## సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం



**నాగర్‌కర్నూల్, మార్చి 7 (జనంసాక్షి) :** మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బిజినపల్లి మండల పరిధిలో విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఇఓ రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అమూల్యమని, ముఖ్యంగా విద్యా రంగంలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పడంలో మహిళా ఉపాధ్యాయులు ముందుంటారని డిఇఓ పేర్కొన్నారు. మహిళలు విద్యా రంగంలో మరింత ముందుకు రావాలని, వారి సేవలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు కూడా తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. మండల విద్యాధికారి రఘునాథ్ శర్మ, తపస్ జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి, టిపిఆర్టియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ శర్మ, వివిధ మండల స్థాయి ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# పౌష్టికాహారంతో ఆరోగ్యం భద్రం



**మునిపల్లి, మార్చి 7 (జనం సాక్షి) :** పౌష్టికాహారం తీసుకున్నప్పుడే విద్యార్థుల ఆరోగ్యం భద్రంగా ఉంటుందని మునిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఆహార మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ మరియు ఆధునిక వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. పులిహోర, దద్దోజనం, ఉప్మా, బొబ్బట్లు, పాయసం, పండ్ల సలాడ్,రవ్వలడ్లు, పోలెలు,హల్వా,ఉప్మా, బిర్యానీ వంటి 50 రకాల వంటకాలని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి మాట్లాడుతూ... ఆహారోత్సవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతని తెలుకొంటారని అన్నారు. జంక్ ఫుడ్ కి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సంప్రదాయ వంటకాలను తీసుకుని ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి తెలియజేస్తూ మంచి పోషకవిలువలు కలిగిన ఆహార పదార్థాలని పరిచయం చేయడం తో పాటు విద్యార్థులలో స్నేహ భావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులని అభినందించి, వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, పీఆర్ టీయూ ప్రధాన కార్యదర్శి సురేందర్, ఉపాధ్యాయులు మధురిమ,కవిత,అరుణకుమారి, చంద్రమౌళి, బుష్రా, ముజఫరుద్దీన్, ఉషశ్రీ, నరేష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో వాల్టా చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలి

**● అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాపై కఠిన చర్యలు**
**● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**



**సంగారెడ్డి, మార్చి 7 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా వాల్టా చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులతో అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణపై చర్చించారు. జిల్లాలో వాల్టా చట్టం అమలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇసుక, కంకర అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాలో పాల్గొనే వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సహజ ఇసుకకు బదులుగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకే అందిస్తోందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ఇసుకను నిర్ణీత ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని స్పష్టం చేసిన కలెక్టర్, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వినియోగానికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు.మొరం, గ్రావెల్ తవ్వకాలపై సాంకేతికంగా తనిఖీలు నిర్వహించి తవ్వకాల వివరాలు పరిశీలించాలని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసిన అక్రమ రవాణా కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పై మండల, గ్రామ స్థాయిలలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం. రఘుబాబు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ తప్పనిసరి చేయించుకోవాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తాజా సూచనల ప్రకారం ప్రతి రేషన్ కార్డు దారులు అంద రూ తప్పనిసరిగా ఈ కే వై సి చేయించుకోవాలనీ జిల్లా పౌర సరఫరాల అధికారి ఒక ప్రకట నలో తెలిపారు. ప్రస్తుత సమాచారం ప్రకారం నారాయణపేట జిల్లాలో ఈ కే వై సి చేయించుకున్నవారి శాతం 66.53 మాత్రమే వున్నదన్నారు. రేషన్ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడు కూడా మీ దగ్గరలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి ఈ కే వై సి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలనీ తెలిపారు. ఈ కే వై సి చేయించుకోని పక్షంలో భవి ష్యత్తులో రేషన్ సరఫరా పొందడంలో ఇబ్బందులు కలగవచ్చునని తెలిపారు. చాలా కాలం పాటు ఏకే వి సి చేయించుకోకుంటే రేషన్ కార్డు రద్దు అయ్యే అవకాశం ఉందనీ తెలిపారు. అందువలన నారాయణపేట జిల్లా రేషన్ కార్డ్ లబ్దిదారులు సకాలంలో మీ యొక్క రేషన్ కార్డ్ ఈ కే వై సి చేయించు కోవాలి తెలిపారు.

# ఉన్నతమైన విద్య... భవిష్యత్‌కు పునాది

- విద్యార్థినులు లక్ష్యానికి అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** విద్యార్థినులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకొని, అందుకు అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. జిల్లాలోని చౌడారం కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం) పాఠశాలను లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థినుల వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత వంటి అంశాలను పర్యవేక్షించారు. అలాగే ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. వారి బోధన సామర్థ్యాలను పరీక్షించి పలు ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా గణితంపై పట్టు సాధించాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, విద్యార్థినులకు మంచి వాతావరణంలో బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదే విధంగా విద్యార్థినులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఓ రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ

జిల్లాలోని చౌడారం గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడి.. ఇళ్ల నిర్మాణ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.అదే విధంగా పనులు నాణ్యతతో, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో హౌసింగ్ పీడీ మాతృనాయక్, ఇతర సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# వేణు ఊడుగుల టీంకు అభినందనలు



**వరంగల్ ప్రతినిధి,మార్చి 7 (జనం సాక్షి):** 2025 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డ్స్ ప్రకటించగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం, ఉప్పరపల్లి గ్రామ వాస్తవ్యులు వేణు ఊడుగుల నిర్మించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'కి ఉత్తమ చిత్రం అవార్డు రావడంతో ఉద్యోగ సంఘాలు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ అభినందించారు. శనివారం ప్రకటించిన ఉత్తమ అవార్డులలో ఉత్తమ డైరెక్టర్‌గా సాయిలు కంపాటి, ఉత్తమ నేపథ్య గాయకుడిగా అనురాగ్, ఉత్తమ మేల్ యాక్టర్ గా చైతు జొన్నల గడ్డ లకు అవార్డ్స్ రావడం సంతోషకరమైన విషయమని, ఈ సందర్భంగా ఉప్పరపల్లి ఉద్యోగ వ్యాపార వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ వేణు ఊడుగుల టీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అచ్చమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యం గల సినిమాలకు ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషం అని, వేణు ఊడుగుల కిందిస్థాయి ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి చేరుకున్నారని, కష్టం విలువ తెలిసిన వ్యక్తిగా సినీ రంగంలో తనలాంటి వాళ్ళని ఎందరినో ప్రోత్సహిస్తున్నారని,ఆ కోవలోకే రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు కాంపాటి వస్తారని, ఇంకా సినీ పరిశ్రమలో తనలాంటి ఔత్సాహికులను ప్రోత్సహి స్తున్నారని, సామాజిక విలువలతో సినిమాలు తీస్తున్న వేణు ఊడుగులకు ఉప్పరపల్లి గ్రామస్తులు, మిత్రులు అభిమానులు, బంధువులు, సహచర మిత్రులు ప్రత్యక్షంగా పరోక్షంగా అభినందనలు తెలియజేస్తున్నారని, భవిష్యత్తులో వేణు ఊడుగుల నిర్మాతగా, డైరెక్టర్‌గా మరిన్ని ఉత్తమమైన సినిమాలు తీసి ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశిస్తున్నామని అన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు
- రైతు పోరుబాట కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, మార్చి07 (జనంసాక్షి) :** రైతులను అన్నీ విధాల కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు పోరుబాట కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి, వాటిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్ లో సైతం రైతులకు ఇచ్చిన అనేక హామీలు ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. వెంటనే ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ ప్రతీ రైతుకు చేయాలని, ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన ఇన్సూరెన్స్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా రైతు పోరుబాట కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామంలోని రైతులను నుండి దరఖాస్తులు సేకరించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. రైతుల ఖాతాలో వేయాల్సిన 9 వేల కోట్లను కాంట్రాక్టర్ల కు చెల్లించి వారి ద్వారా వచ్చే కమీషన్లు రాహుల్ గాంధీకి ముట్టచెప్పేందుకే రైతులకు రైతు భరోసా వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమాలకు గ్రామాల్లో ప్రజల్లోకి వెళ్ళే దమ్ము కాంగ్రెస్ ఎమ్మెల్యే లకు లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు పర్చకుండా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు.. ప్రజా పాలన ద్వారా గతంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వాటిలో ఎన్ని నెరవేర్చారు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్య నారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నర్సయ్య, జిల్లా, మండల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సాయికుంట ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయ చర్యలు

- విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత..
- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం




**హనుమకొండ ప్రతినిధి మార్చి 7 (జనం సాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాను అభివృద్ధిపథంలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గత దిశా సమావేశంలో నిర్ణయించిన అంశాలపై తీసుకున్న చర్యలు, మహిళా శిశు సంక్షేమ, జిల్లా వైద్య ఆరోగ్య, విద్యా, వ్యవసాయ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య, నీటిపారుదల, గనులు, భూగర్భ జల, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, జిల్లా ముఖ్య ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో దిశా కమిటీ ఛైర్ పర్సన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్ పై దృష్టి సారించాలని అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండాలన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో వైద్య ఆరోగ్య సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. వచ్చే దిశా సమావేశానికి అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలతో హాజరుకావాలని అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ స్థాయిలో ఉందని అన్నారు. జిల్లాలతో పోల్చుకున్నట్లయితే జిల్లా ప్రగతి తక్కువగా ఉందన్నారు. జిల్లా లో ప్రీ స్కూల్స్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్రోల్మెంట్ మీద అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. వరంగల్ చౌరస్తా ప్రాంతంలో డ్రైనేజి సమస్య పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో 400లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని 18వేలమంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని. విద్యార్థుల ప్రవేశాల నమోదును పెంచాలని, మండలానికి ఇన్చార్జి అధికారిని నియమించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల ప్రవేశాలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సోలార్ సదుపాయాన్ని కల్పించాలని, ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల స్థాయిలో హార్ట్ ఎటాక్‌లు వస్తున్న దృష్ట్యా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. మడికొండ డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని, అదేవిధంగా హసన్ పర్తి టౌన్ లో తాగునీటి సమస్య ఉందని వాటికి పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ శాయంపేట మండలం పెద్దకోడెపాకలోని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేవని అన్నారు. పాఠశాలల్లో తాగునీరు, కరెంటు, టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ను కోరారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు సమావేశంలో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలని అధికారులకు సూచించారు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పనుల పురోగతి కొరకు అధికారులంతా సమిష్టిగా పనిచేస్తూ ప్రగతి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఎప్పటిక ప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో పత్తిపల్లి రోడ్డు వద్ద విద్యుత్ లైన్ లను, జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని,మిషన్ భగీరథ, ఇరిగేషన్ కార్యాలయాలను, లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ పత్తిపల్లి రహదారి హాస్పటల్ నుంచి తోపుకుంట వరకు రోడ్డు విస్తరణలో సీసీ రోడ్డు లో ఉన్న విద్యుత్ లైన్ షిఫ్టింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.లైన్ షిఫ్టింగ్ చేసే సమయంలో సంబంధిత కౌన్సిలర్, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు భాగస్వా మ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని పరిశీలించి తాగునీటి శుద్ధి కేంద్రాన్ని, వంటగదిని, భోజనం, స్టోర్ రూమ్, కూరగాయలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించా లని విద్యాలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. వసతి గృహంలో భోజన సదుపాయాలు, ఉపాధ్యాయుల పనితీరు, వసతుల కల్పన గురించి స్వయంగా విద్యార్థులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రం లోని నూతన కలెక్టరేట్ ఎదురుగా ఉన్న స్థలంలో లైసెన్సుడ్ సర్వేయర్ల ప్రాక్టికల్ గా భూ సర్వే చేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి, డిజిటల్ సర్వే పరికరాల పనితీరును స్వయంగా అడిగి తెలుసుకు న్నారు. సర్వే చేసే క్రమంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,ఆర్డీవో వెంకటేష్,ఎలక్ట్రిసిటీ డిఈఈ నాగేశ్వరరావు, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్,ములుగు తాహసిల్దార్ విజయభాస్కర్, విద్యాలయ ప్రిన్సిపల్ నర్మదా భాయ్, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అడవి బిడ్డ విజయానికి ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్ అండ

- జాతీయ క్రికెటర్ తాటి కృష్ణవేణికి ఘన సన్మానం



**గంగారం మార్చి 7 (జనం సాక్షి) :** మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతం లోని తీర్మాలగండి గ్రామానికి చెందిన జాతీయ స్థాయి క్రికెటర్ తాటి కృష్ణవేణికి ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మారుమూల చిన్న గ్రామం నుండి పెద్ద కలలతో ముందుకు సాగి జాతీయ స్థాయికి చేరిన కృష్ణవేణి విజయాన్ని ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి కృష్ణవేణిని ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు భరత్, అజ్మీర్ చేతుల మీదుగా కృష్ణవేణిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపా రు. అనంతరం ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్ తరఫున కృష్ణవేణికి ప్రోత్సాహక ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ తాటి కృష్ణ రావు మాట్లాడు తూ ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి తాటి కృష్ణవేణి మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఫరెవర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనలాంటి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ ప్రోత్సాహం భవిష్యత్తులో ఇంకా మంచి ప్రతిభ కనబర్చేందుకు తనకు బలాన్ని ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపినాథ్,ఫౌండేషన్ లీడర్స్ మహేష్, గణేష్, వంశీ, అఖిల్, అక్రమ్, గణేష్, సంతోష్,మాలోత్ సంతోష్, భూక్యా నందు,భూక్యా సంతోష్,భానోత్ రాజేష్, గుగులోత్ చంద్ర శేఖర్ జరుపుల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారితే ప్రధాన లక్ష్యం

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



**నిర్మల్ బ్యూరో, మార్చి7 (జనంసాక్షి) :** మహిళల భద్రత, సాధికారత లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత ఏడాది కాలంలో మహిళా పోలీసుల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలను సాధించాయని ఆమె వెల్లడించారు. జిల్లాలో మహిళల భద్రత, విద్యార్థుల అవగాహన కోసం పోలీస్ అక్క నారిశక్తి, శివంగి వంటి వినూత్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పోలీస్ అక్క కార్యక్రమం ద్వారా మహిళా పోలీసులు కేజీబీవీ పాఠశాలలను దత్తత తీసుకొని విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ వంటి అంశాలపై విద్యార్థులకు చైతన్యం కల్పిస్తున్నారు. ప్రతి బుధవారం నిర్వహించే నారిశక్తి కార్యక్రమంలో మహిళా పోలీసులు గ్రామాలు, పాఠశాలలు, కాలేజీలను సందర్శి స్తూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘిం చిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. నిర్మల్ జిల్లాలో రాష్ట్రంలోనే తొలి మహిళా ప్రత్యేక కమాండో దళంగా శివంగిను ఏర్పాటు చేశారు. 20 మంది మహిళా కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ దళాన్ని రూపొందించగా, అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లు, వరదల సమయంలో సహాయక చర్యలు వంటి సేవల్లో వారు పాల్గొన్నారు. షీ టీమ్, భరోసా కేంద్రం ద్వారా కుటుంబ సమస్యలతో దూరమైన భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇప్పటివరకు 133 జంటలను మళ్లీ కలిపినట్లు ఎస్పీ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తేనే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని, మహిళల భద్రత కోసం నిర్మల్ పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తారని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల పేర్కొన్నారు.



# బాబూ.. బడికి పోలేదా?

- విద్యార్థిని పలకరించిన కలెక్టర్

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 7(జనంసాక్షి ):** జిల్లా కలెక్టర్ కె హరిత దహేగాం మండల పర్యటనలో భాగంగా మార్గం మధ్యలో ఐనం గ్రామం వద్ద ఓ బాలుడు రోడ్డుపై కనిపించడంతో తన వాహనాన్ని ఆపి అతనిని ఆప్యాయంగా పలకరించారు. బాబు బడికి వెళ్తున్నావా అని కలెక్టర్ ప్రశ్నించగా ఆ బాలుడు బడికి వెళ్లడం లేదని తెలిపాడు. ఎందుకు ఈ రోజు బడికి వెళ్లలేదు అని కలెక్టర్ అడగగా, తన ఒంటిపై దురద సమస్య ఉండడంతోనే పాఠశాలకు వెళ్లలేదని బాలుడు చెప్పాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ కే హరిత విద్యార్థి ఆరోగ్యం గురించి తెలుసుకొని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ చదువుపై దృష్టి పెట్టాలని, విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. కలెక్టర్ చూపిన ఆప్యాయతతో బాలుడు ఆనందం వ్యక్తం చేశాడు.



# పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించండి

- దీర్ఘకాలం పన్నులు చెల్లించని గృహాన్ని సీజ్ చేసిన అధికారులు..

**వరంగల్ ఎంజీఎం, మార్చి 7(జనంసాక్షి):** పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు.ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సం. ముగింపునకు గడువు సమీపిస్తుండడంతో ఆస్తి, నల్లా పన్నులు చెల్లించి కార్పొరేషన్ కు ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు.శనివారం ఖాజీపేట సర్కిల్ పరిధి లో సుదీర్ఘం గా పన్ను చెల్లించకుండా ఉన్న గృహాన్ని జిల్లా కలెక్టర్/ కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధి లో దీర్ఘకాలం పన్నులు చెల్లించకుండా ఉన్న గృహ యాజమాన్యాలకు పన్ను చెల్లించాలని కోరుతూ నోటీసులు అందజేయడం జరిగిందని, ఐనను పన్ను లు చెల్లించని గృహాలను జిల్లా కలెక్టర్/ కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేయడం జరుగుతుందని కావున ప్రజలు సహకరించి సకాలం లో పన్నులు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ అధికారులు బాకం సంతోష్, శేహజాది బేగం, ఎస్ ఎఫ్ ఓ రాజేశ్వర్ రావు, ఆర్ ఐ నరేష్ తో పాటు టాక్స్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- **వేతనాలను నేరుగా బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయాలి**

**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసి నేరుగా ప్రభుత్వమే కార్మికుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం మండల పంచాయతీ అధికారి రావూప్ అలీ కి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం స్థానిక సుభాష్ సెంటర్లో ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం




గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని నెలలు తరబడి పనిచేసిన గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు అందకపోవడంతో ఇల్లు గడవని పరిస్థితి నెలకొంది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మండల వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి కార్యదర్శులకు, సర్పంచ్ లకు సూచనలు చేయాలని, ఆన్లైన్ చేయని కార్మికుల పేర్లను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేసి జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఆరోగ్య భద్రత ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే మరో సమ్మె జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మేడి రామచంద్రం, మంచాల రేణుక, నల్ల సుగుణమ్మ, మంటి నాగరాజు, మంటి అంజయ్య, పుట్ట నాగరాజు, శ్రీ ఉక్కుర్తి లచ్చమ్మ, జయమ్మ, కొమ్ము కవిత, బల్లుర చందన, శంకరమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్



**వైరా, మార్చి 7 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన సొంత వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్. ఖమ్మం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పనిచేస్తున్న బాలకృష్ణ తనికెళ్ళ గ్రామంలో కుక్క అడ్డురావడంతో బైక్ పైన నుంచి పడ్డాడు. దీంతో కృష్ణకు గాయాలు కావడంతో అప్పుడే అటుగా నుంచి వస్తున్న డిసిహెచ్ రాజశేఖర్ గౌడ్ తన వాహనాన్ని ఆపి స్వయంగా తానే తన వాహనంలోని ఎక్కించుకొని వైరాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు .సకాలంలో స్పందించి చికిత్స చేయడం ద్వారా గాయపడిన వ్యక్తి ప్రమాదం నుండి బైట పడ్డాడు.మెరుగైన చికిత్స అందించి సకాలంలో స్పందించి తన వాహనంలో ఆసుపత్రి తరలించినందుకు గాను పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

- **నిందితుడు కామంచి శివకృష్ణపై కేసు**

**గుర్రంపోడు, మార్చి 7 (జనంసాక్షి) :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాల ఆటకట్టించారు. శనివారం ఉదయం గుర్రంపోడు మండలం ఎరడ్లగూడెం గ్రామ శివారులో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భారీగా బియ్యం నిల్వలు పట్టుబడ్డాయి. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం 9:30 గంటల సమయంలో గ్రామ పొలిమేరల గుండా వెళ్తున్న టీ 05 ఖజ 8447 సంఖ్య గల మూడు



చక్రాల వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 25 తెల్లటి సంచులను గుర్తించారు.వాటిని పరిశీలించగా సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించుకున్న పోలీసులు, వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కామంచి శివకృష్ణ అనే వ్యక్తిపై కేసుఎ నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పేదల బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**భువనగిరి పట్టణం, మార్చి 7 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని వినాయక చౌరస్తా వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమకారులు త్యాగాలు చేసి పోరాడారని, వారికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ.30,000 పెన్షన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ ఉద్యమకారుల పట్ల ఎందుకు వివక్ష చూపిస్తోందో అర్థం కావడం లేదని అన్నారు. అంబేద్కర్ ఆశయాల ప్రకారం చిన్న రాష్ట్రాల



ఆవశ్యకతను కొనసాగిస్తున్న ఉద్యమకారులకు అంబేద్కర్ పెద్ద దిక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎల్.ఎఫ్. నాయకులు కొడిమాల కృష్ణ, గొర్ల లక్ష్మణ్, మంతపురం వినోద్ కుమార్, గోపరాజు గణేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ తాగునీరు రాక నాలుగు నెలలు..!

- **సర్పంచ్ గూగులోతు కోటేష్ నాయక్**



**నూతనకల్, మార్చి 7 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మాచనపల్లి గ్రామపంచాయతీ కి మిషన్ భగీరథ త్రాగునీరు రాక నాలుగు నెలలు అవుతుందని వేసవికాలం రావడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని శనివారం సర్పంచ్ గుగులోత్ కోటేష్ నాయక్ అన్నారు గ్రామస్తులు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి వ్యవసాయ బోర్ల వద్ద బిందెలు, క్యానులలో నీరు తెచ్చుకొని ఆరకోర జీవితం గడుపుతున్నారు పదేపదే సర్పంచ్ ఉన్నతాధికారులను,ఆర్డబ్ల్యూఎస్,మిషన్ భగీరథ ఏఈ,డిఈ లను ఎన్నోసార్లు కలసి మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని వాపోతున్నారు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని,చూపనిపక్షంలో ధర్నాకు దిగుతామని గ్రామస్తులు అధికారులను హెచ్చరిస్తున్నారు.సర్పంచ్ అధికారులతో మాట్లాడగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వివరిస్తూ పాత మోటర్లు రిపేర్లు రావడం వలన వాటిని రిపేరు చేయించి మళ్లీ ప్రారంభించినా ఫలితం లేక మోటర్లు నడవడం లేదు కావున రెండు మూడు రోజులలో కొత్త మోటరు తెప్పించి ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఏఈ హామీ ఇచ్చారు అని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్క కొమరయ్య యాదవ్, మహిళలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ ప్రాముఖ్యతపై అవగాహన




**చేర్యాల, మార్చి 7 (జనంసాక్షి) :** ఆధునిక వ్యవసాయం డ్రోన్ ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కలిగి ఉండాలని చేర్యాల మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల గ్రామ రైతు వేదికలో గ్రామ సర్పంచ్ జానకి కృష్ణ లీల స్వామి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక వ్యవసాయంలో భాగంగా రైతులు డ్రోన్ టెక్నాలజీ వాడకపు చాలా ప్రాముఖ్యత సమకూర్చుకుందని, రైతులు డ్రోన్ టెక్నాలజీ దాని వ్యవసాయంపై వాడకం గురించి తప్పక తెలుసుకునే బాధ్యత అన్నారు. డ్రోన్స్ ద్వారా ఎరువులు ,విత్తనాలు అదేవిధంగా పురుల మందులు స్ప్రే అతి తక్కువ సమయంలో రైతుకు డబ్బులు ఆదా కావడం జరుగుతుందని, రైతులు ఈ డ్రోన్ టెక్నాలజీ గురించి తప్పనిసరి తెలుసుకోవాలని, పెద్ద రైతులు ఈ డ్రోన్ అనేది చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర అన్యాయం

- **ప్రజా ప్రతినిధులు సైతం ఇచ్చిన మాట తప్పుతున్నారు**
- **బైపాస్ రోడ్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల ఆవేదన**

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** విలువైన భూమి కోల్పోతున్న తమకు ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 765 డిజి మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుంద నీ గతంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాతో సమావేశం ఏర్పాటు చేసి తగిన నష్టపరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో తాము రోడ్డు నిర్మాణానికి అంగీకరించామనీ తెలిపారు.కానీ తమక్ ఇచ్చిన హామీ మేరకు నష్టపరిహారం చెల్లించడంలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. 2022 సంవత్సరంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం నివేదిక ప్రకారం భూముల విలువ గజం మెదక్ రోడ్ లో 7000 రూపాయలు ఉండగా తమకు ఇచ్చిన నోటీసుల ప్రకారం 2000 మాత్రమే చెల్లిస్తున్నారు. 7000ఐ3= 21000 రూపాయలు చెల్లించాల్సి ఉండగా కేవలం 2000 ఇవ్వడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నాం అన్నారు. హైదరాబాద్ రోడ్ లో గజం రిజిస్టర్ వెలివేషన్ ప్రకారం 5000 ఉండగా , 15వేల రూపాయలు చెల్లించాల్సింది పోయి కేవలం 2500 మాత్రమే చెల్లిస్తున్నారు దీంతో నష్టపోతున్నాము, అంతేకాకుండా వ్యవసాయ భూమికి ఎకరాకు కేవలం 8



లక్షల 50 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు, హెచ్ఎండిఏ పరిధిలోని త్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు 45 లక్షల రూపాయలు చెల్లిస్తుంది, మాకు 8,50,000 చెల్లించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం, బోరు బావుల విషయంలో కూడా మాకు నష్టం జరుగుతుంది. కావున నష్టపరిహారం చెల్లించడంలో అన్యాయం జరుగుతుంది కాబట్టి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాము. వ్యవసాయ భూములు కూడా ప్లాట్ ధరతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలి, మాకు ఇచ్చిన హామీ మేరకు మెదక్ రోడ్డులో గజంకు 21 వేల రూపాయల నష్టపరిహారం, హైదరాబాద్ రోడ్ లో పదిహేను వేల రూపాయలకు గజం చొప్పున నష్టపరిహారం చెల్లించాలి, ఎకరం భూమికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి, మెదక్ చౌరస్తా నుండి దౌల్తాబాద్ చౌరస్తా వరకు ఎలాంటి బ్రిడ్జి నిర్మాణం లేకుండా మాకు ఇచ్చిన హామీ మేరకు కింది నుండే రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి..మాకు సరైన నష్టపరిహారం చెల్లించినట్లయితేనే తాము భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామనీ, లేనిపక్షంలో మేము భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేస్తున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి) :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అనురాగ జయంతి సూచించారు. శనివారం రామన్నపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ వంట గది, డైనింగ్ రూమ్, విద్యార్థులు పడుకునే బెడ్స్ పరిశీలించారు. డైనింగ్ రూమ్ శుభ్రంగా లేదని ప్రతి రోజు శుభ్రపరుచుకోవాలి అని తెలిపారు.ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకి మంచి నాణ్యమైన భోజనం పెడుతున్నార లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు వండే ఆహారం పరిశుభ్రంగా వంట చేయాలన్నారు. హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.మంచినీటి ఆర్. ఓ ప్లాంట్ ను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వ ఆద్విక్ జన్మదిన సంబరాలు

- **హాజరైన స్పీకర్, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు**

**తాండూరు, మార్చి 7 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మనుమడు, బుయ్యని శివకుమార్ రెడ్డి--కావ్య దంపతుల కుమారుడు బుయ్యని విశ్వ ఆద్విక్ మొదటి పుట్టినరోజు వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం రాత్రి జన్వాడలోని ఆర్య కన్వెన్షన్ లో అట్టహాసంగా విశ్వ ఆద్విక్ జన్మదిన సంబరాలను జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇతర రంగాల ప్రముఖులు కూడా హాజరై చిన్నారికి శుభాశీస్సులు అందించారు. ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,రాజకీయ ప్రముఖులు, నాయకులు, అధికారులు, పాల్గొని చిన్నారికి ఆశీస్సులు



అందించారు.

## ఘనంగా కెటిఎస్ ఆవిష్కార్ రోబో ఫెస్ట్-2026



**దేవరకొండ, మార్చి 7 (జనం సాక్షి) :** దేవరకొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు రోబోటిక్స్,సైన్స్ నాలెడ్జ్ అవగాహన ఈవెంట్ "కెటిఎస్ ఆవిష్కార్ రోబో ఫెస్ట్-2026" కార్యక్రమాన్ని శనివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక డిఎస్పి శ్రీనివాసరావు , సిఐ వెంకట్ రెడ్డి, గౌరవ అతిథిగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రఘువీరా చారి ,రోబోటిక్స్ వ్యవహార కర్త శర్మ జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డి.ఎస్.పి శ్రీనివాసరావు మాట్లాడుతూ "నేడు అత్యంత అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలలో ఒకటిగా ఉన్న రోబోటిక్స్ పిల్లలు తమ జీవితంలో ప్రారంభ దశలోనే నేర్చుకున్నట్లయితే వారికి ప్రయోజనం చేకూరుతుందని, రోబోటిక్స్ వల్ల పిల్లల్లో ఊహ, ఏకాగ్రత, శ్రద్ధ మరియు పరిశీలన నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు.సీఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ "ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిందని,స్కిల్ డెవలప్మెంట్ సామర్థ్యం ఉన్నవారే ఉపాధి పొందుతున్నారని,టెక్నాలజీ ఉపయోగించుకొని యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ నవీన్ గౌడ్ , వైస్ ప్రిన్సిపల్ అన్వర్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఊపిరితిత్తుల సంరక్షణే ఆరోగ్యం

**ఖమ్మం, మార్చి 7 (జనంసాక్షి) :** ఆరోగ్య సంరక్షణ కోసం డాక్టర్లు ఇచ్చే సలహాలను పాటించి ఆచరణలో పెడితేనే మనిషి జీవనశైలి దృఢంగా వుంటుంది అని నగర ప్రముఖులు డాక్టర్ కాట్రగడ్డ యమున, నున్నా నాగేశ్వరరావు, కె.రమేష్ పేర్కొన్నారు. శనివారం నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా మంచికంటి పంక్షన్ హాల్ లో ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా జరిగింది. బీవీకే సీపీఎం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల శనివారం జరుగుతున్న నేపథ్యంలో శనివారం నాలుగు వందల పేషెంట్లకు బిపి, షుగర్, మూర్ఛ పేషెంట్లకు నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ ఛాతీ వైద్య నిపుణులు కాంట్రగడ్డ యమున పలువురు పేషెంట్లకు టెస్ట్లు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊపిరితిత్తుల సంరక్షణే ఆరోగ్యానికి నిలువుటద్దం అని తెలిపారు. రెగ్యులర్ గా సమతుల్య ఆహారం తీసుకోవడం



ద్వారా మనిషి తన జీవిత కాలం ఎక్కువగా కొనసాగించే అవకాశం ఉంది అని తెలిపారు. సిగరెట్లు, మద్యం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలి అని కోరారు. ప్రముఖ బ్యాంక్ ఎంప్లాయ్ కె.రమేష్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రతి నెలా పేదలకు ఉపయోగపడే విధంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. తమ కుటుంబ నుంచి ఒక నెలకు సరిపడా మందులకు అయి ఖర్చును అందజేస్తామని హామీ ఇచ్చారు. జూవీ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నారు అని ఆరోపించారు. వచ్చే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆరోగ్య రంగానికి నిధులు ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ గా వున్న పోస్ట్ లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రిలో జాయిన్ అయితే వాళ్ల ఆర్థికంగా చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ డాక్టర్లు సి భారవి, పి సుబ్బారావు, జెట్ల రంగారావు, అడపా జయశ్రీ, వినుషా ఆధ్వర్యంలో ఉచితంగా టెస్ట్ లు అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు వై శ్రీనివాసరావు, పి ఝాన్సీ, ఎమ్ సుబ్బారావు , బోడపట్ల సుదర్శన్, జె వెంకన్న బాబు, జుఎ భద్రం, వాసిరెడ్డి వీరభద్రం, పి శివనారాయణ, జాఖ అఫ్జల్, ప్రమీల, విజయలక్ష్మి, సీతా రామశేఖరం తదితరులు పాల్గొన్నారు.




# మళ్లీ భారీ నష్టాలు

- వారంలో సెన్సెక్స్, నిఫ్టీ 2.9% పతనం
- ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.6030.38 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు.. రూ.6971.51 కోట్లు

**న్యూఢిల్లీ:**లాభాల ఉపశమనం ఒక్కరోజుకే పరిమితమైంది. శుక్రవారం స్టాక్ మార్కెట్లు మళ్లీ భారీ నష్టాలను చవిచూశాయి. పశ్చిమాసియాలో యుద్ధం ఏడో రోజుకు చేరడం, ముడి చమురు ధర భారీగా పెరగడం ఇందుకు నేపథ్యం. అమెరికా, ఐరోపా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 18 పైసలు తగ్గి 91.82 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 8.35% పెరిగి 92.54 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.22 లక్షల కోట్లు తగ్గి రూ.449.68 లక్షల కోట్ల (4.90 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.



ఆద్యంతం నష్టాల్లోనే: బీఎస్ఈ సెన్సెక్స్ 79,658.99 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 80,015.90) ఆరంభమయ్యింది. అదే ఒరవడి కొనసాగిస్తూ ఒక దశలో 78,812.18 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 1097.00 పాయింట్ల నష్టంతో 78,918.90 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 315.45 పాయింట్లు కోల్పోయి 24,450.45 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,415.75 వద్ద కనిష్ఠాన్ని, 24,700.90 వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 2,368.29 పాయింట్లు (2.91%), నిఫ్టీ 728.20 పాయింట్లు (2.89%) నష్టపోయాయి.

6 కంపెనీల షేర్లకే లాభాలు: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 6 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్ 3.39%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.39%, యాక్సిస్ బ్యాంక్ 2.58%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.56%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.39%, ఎస్‌బీఐ 2.37%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.27% నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.11%, సన్‌ఫార్మా 0.9%, ఎన్‌టీపీసీ 0.61%, ఇన్ఫోసిస్ 0.26%, హెచ్‌సీఎల్

## హెచ్‌డీఎఫ్‌సీ రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్..

### తగ్గిన ఎంసీఎల్ఆర్ రేట్లు

ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. నిధుల ఆధారిత రుణ రేట్ల (ఓఅఖీ)పై 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు బ్యాంకు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐ తగ్గే అవకాశం ఉంది. ఈ మేరకు చేసిన మార్పులు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. రుణగ్రహీతలు తీసుకున్న రుణ కాల పరిమితి ఆధారంగా ఓఅఖీ రేట్లను గతంలో 8.25% నుంచి 8.60% వరకు బ్యాంకు వసూలు చేసింది. ప్రస్తుతం చేసిన మార్పుల ఆధారంగా వడ్డీ రేట్లు 8.15% నుంచి 8.55% వరకు తగ్గాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చినెలలో తగ్గిన ఓఅఖీ రేట్లను పరిశీలిస్తే.. నెల కాలపరిమితి గల రుణాలపై 10 బేసిన్ పాయింట్ల మేర తగ్గించింది. అంటే 8.25% నుంచి 8.15% మేర ఎంసీఎల్ఆర్ రేట్లు తగ్గాయి. 5 బేసిస్ పాయింట్లతో 3 నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ రేట్లు 8.30% నుంచి 8.25%, 6 నెలలు, ఏడాది రుణాలపై 8.40% నుంచి 8.35%, 2 ఏళ్ల రుణాలపై 8.50% నుంచి 8.45%, 3 ఏళ్ల రుణాలపై 8.60% నుంచి 8.55%కు బ్యాంకు తగ్గించింది. కాగా, ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఖాతాదారులకు కూడా బ్యాంకు గుడ్‌న్యూస్ చెప్పింది.

## ఫండ్ యూనిట్లను లాక్ చేసుకోవచ్చు: సెబీ

**న్యూఢిల్లీ:** మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారుల డిజిటల్ భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. మదుపరుల ఖాతాల నుంచి వారి ప్రమేయం లేకుండా యూనిట్లు బదిలీ కాకుండా (డెబిట్) నిరోధించేందుకు వీలుగా డీమ్యాట్, డీమ్యాట్‌లో లేని ఫోలియోల కోసం స్వచ్ఛంద డెబిట్ ఫ్రీజ్ అనే సరికొత్త సదుపాయాన్ని ప్రవేశ పెట్టింది. ఏప్రిల్ 30 నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. ఇందువల్ల పెట్టుబడిదారులు తమ మ్యూచువల్ ఫండ్ ఫోలియోలను లాక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. కావాలనుకున్నప్పుడు తిరిగి ఖాతాలను అన్‌లాక్ చేసుకోవచ్చు. అప్పటివరకూ యూనిట్లు డెబిట్ కావని సెబీ స్పష్టం చేసింది. అప్పటివరకూ యూనిట్లు డెబిట్ కావని సెబీ స్పష్టం చేసింది. తొలి దశలో భాగంగా రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు(ఆర్‌టీఏ), ఎంఎఫ్ సెంట్రల్ ప్లాట్‌ఫామ్ ద్వారా మదుపరులకు ఈ ఫోలియో లాక్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. యాంఫీ నుంచి మార్గదర్శకాలు: డెబిట్ ఫ్రీజ్ విధానాన్ని సమర్థంగా అమలు చేసేందుకు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, ఆర్‌టీఏలకు భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనుంది. ఈ ఖాతాలు లాక్-ఇన్ పీరియడ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు అనుమతించాలనే విషయంపైనా స్పష్టత ఇవ్వనుంది. ఏఎంసీలు, ఆర్‌టీఏలూ తమ వెబ్‌సైట్లలో ఈ వివరాలను స్పష్టంగా వెల్లడించాలని సెబీ స్పష్టం చేసింది.

# రూ.6వేల కోట్లు

### : సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీని పెంచిన గూగుల్

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీ భారీగా పెరిగింది. రానున్న మూడేళ్ల కాలానికి ఆ మొత్తాన్ని 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ నిర్ణయం తీసుకుంది. అంటే భారత కరెన్సీలో అక్షరాలా రూ.6,361కోట్లు. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది.
ఈ వేతన ప్యాకేజీలో వార్షిక జీతం 2 మిలియన్ డాలర్లు కాగా.. పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ (ఖూజ) విలువ 126 మిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నదాని ఆధారంగా ఈ మొత్తం సర్దుబాటు అవుతుంది. పరిమిత స్టాక్ వెస్టింగ్ ద్వారా 84 మిలియన్ల డాలర్లను అందుకుంటారు. పరిమిత స్టాక్ వెస్టింగ్ అంటే.. కంపెనీ ఉద్యోగికి మంజూరు చేసే షేర్లు. పదవీకాలం పూర్తయిన లేదా పనితీరు ఆధారంగా ఇవి ఉద్యోగికి బదిలీ అవుతుంటాయి. అలాగే ఆల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యేమో, వింగ్ ఏవియేషన్లలో 175 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కేటాయించారు. ఈ రెండు సంస్థలకు సుందర్ పిచాయ్ నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ ప్రోత్సాహకాలు



నిదర్శనమని ఆల్ఫాబెట్ బోర్డు వెల్లడించింది. ఏఐతో టెక్ ప్రపంచం వేగంగా మారుతున్న క్రమంలో పిచాయ్‌పై బలమైన నమ్మకంతో కంపెనీ ఈ వేతన పెంపును ప్రకటించింది. 2004లో గూగుల్ (ఉనీనీణశ్రీవ)లో చేరిన సుందర్ పిచాయ్.. 2015లో సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ దశాబ్దకాలంలో ఆ సంస్థ మార్కెట్ విలువ ఏడు రెట్లు పెరిగింది. 535 బిలియన్ డాలర్ల నుంచి 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఈ జనవరిలో ఒక దశలో 4 ట్రిలియన్ల డాలర్ల మార్క్‌ను తాకింది.

## మీషోకు ఐటీ షాక్..

### రూ.1500 కోట్లు చెల్లించాలని నోటీసులు

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఈకామర్స్ సంస్థ మీషోకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. 2023-24 మదింపు సంవత్సరానికి గాను రూ.1,500 కోట్లు చెల్లించాలని ఉత్తర్వు లు జారీచేసింది. అయితే, ఈ ఉత్తర్వులను సవాలు చేస్తామని మీషో వెల్లడించింది. న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఐటీ నిబంధనల ప్రకారం.. 2023-24 మదింపు సంవత్సరానికి గాను వడ్డీలతో కలుపుకొని సుమారు రూ.1500 కోట్లు చెల్లించాలని మీషోకు ఆదాయ పన్ను శాఖ డిమాండ్ నోటీసు ఇచ్చింది. అయితే, ఈ డిమాండ్లతో ఏకీభవించట్లేదని కంపెనీ పేర్కొంది. తమ వ్యాపార లావాదేవీలు, పన్ను చెల్లింపులు నిబంధనల ప్రకారమే ఉన్నాయని తెలిపింది. కంపెనీ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని మీషో స్పష్టం చేసింది. ఐటీ నోటీసులు కంపెనీ ఆర్థిక కార్యకలపాలపై ఎటువంటి ప్రభావం చూపవని పేర్కొంది. కాగా, గతంలోనూ 2022-23 మదింపు సంవత్సరానికి గాను మీషోకు ఐటీ నోటీసులు అందాయి. ఇది ప్రస్తుతం కర్ణాటక హైకోర్టులో పెండింగులో ఉంది. ఈ నోటీసులపై కోర్టు మధ్యంతర స్టే విధించింది. డిసెంబర్ త్రైమాసికానికి మీషో రూ.491 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 12% పెరిగింది. కంపెనీ ఆదాయం 32% వృద్ధి చెంది రూ.3,517.6 కోట్లకు చేరింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,49,300 | ₹ 1,62,880 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# ఇజ్రాయెల్ 'అణు' గుండెకాయపై ఇరాన్ గురి..!

**న్యూఢిల్లీ:**ఇజ్రాయెల్ ఒక్క అణు రియాక్టర్ కోసం గతంలో అమెరికానే మోసం చేసింది. అది దాని అణు కార్యక్రమానికి గుండెకాయ వంటిది. అగ్రరాజ్యం కన్నుగప్పి ఫ్రాన్స్ సాయంతో నిర్మించిన ఈ అణుకేంద్రం ఇప్పుడు ఇరాన్ గురిలోకి వచ్చింది. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. దేశంలోని నెగెవ్ ఏడారిలో యురేనియం నిల్వల కోసం గాలించినా ఎక్కడా దొరకలేదు. 1950ల్లో ఇజ్రాయెల్ అటామిక్ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. 1956 సూయజ్ కాలువ సంక్షోభం తర్వాత అమెరికాపై అసంతృప్తితో ఇజ్రాయెల్-ఫ్రాన్స్ దేశాలు దగ్గరయ్యాయి. దీంతో రహస్యంగా భారజల రియాక్టర్‌ను నిర్మించేందుకు పారిస్ అంగీకరించింది. స్వదేశంలో మాత్రం ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఉంచింది. కానీ, ఫ్రాన్స్‌లో ప్రభుత్వం మారి చార్లెస్ డిగాల్ అధికారంలోకి వచ్చి ఈ డీల్ గురించి తెలుసుకొని కంగారుపడ్డారు. అప్పటికే రియాక్టర్‌కు సంబంధించిన కీలక టెక్నాలజీ ఇజ్రాయెల్‌కు చేరింది. ఇక డీల్‌ను రద్దు చేస్తే ఫ్రాన్స్ కంపెనీలు దివాలా తీసే ప్రమాదం ఉండటంతో ఆయన ఊరుకుండిపోయారు.ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. దీంతో అది అణు విద్యుత్తు ఉత్పత్తి కోసం కాదన్నది సుస్పష్టం. ఆ తర్వాత అమెరికా నిఘా విమానం ఈ భారీ కాంక్రీట్ డోమ్ ఉన్న భవనం ఫొటోలు తీసింది. తొలుత ఇది ఒక టెక్స్‌టైల్ ఫ్యాక్టరీ అని ఇజ్రాయెల్ నమ్మబలికింది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ వీటిని విశ్లేషించి ఆ భారీ నిర్మాణాన్ని అణురియాక్టర్‌గా తేల్చింది. ఈ విషయం అప్పటి



అమెరికా అధ్యక్షుడు కెనడీ వద్దకు చేరింది. దీంతో తమ అధికారుల 'తనిఖీల'కు అనుమతించాలని ఆయన ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ, ఇజ్రాయెల్ కేవలం 'సందర్శన'కు మాత్రమే అనుమతించింది. అంతేకాదు.. పశ్చిమాసియాలోకి కొత్త ఆయుధాలు తీసుకురాబోమని అమెరికాకు హామీ ఇచ్చి ఆ దేశ తనిఖీ బృందం కళ్లుగప్పింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియం కోసం అమెరికాలోని అపోలో పట్టణంలోని న్యుమెక్ (ది న్యూక్లియర్ మెటీరియల్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్)ను ఇజ్రాయెల్ ఏజెంట్లు పలుమార్లు సందర్శించి విడతలవారీగా 200-600 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియాన్ని అపహరించారు. ఇక సాధారణ యురేనియం కోసం ఆపరేషన్ ప్లమ్‌బాట్‌ను చేపట్టి సముద్రంలో ఓ నౌక నుంచి 200 టన్నుల ముడి యురేనియంను అపహరించారు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది.

**దీనిపై దాడితో చుట్టుపక్కల దేశాల పైనా ఎఫెక్ట్**

ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.
ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది.
ఇరాన్ అమ్ములపొదిలోని అస్త్రాలు ఏమిటీ..
డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి.

## నిరుద్యోగులపై మమత వరాల జల్లు

ఖాతాల్లో జమ అవుతాయన్నారు. యువ సాథి అనే ఈ స్కీమ్ 21-40ఏళ్ల వారికి వర్తిస్తుందని తెలిపారు. ఈ సాయంతో వారు స్వయం సమృద్ధిగల భవిష్యత్తు వైపు పయనించగలుగుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యువ సాథి స్కీమ్‌ను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ముందు భావించినట్లు మమత తెలిపారు.
అయితే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా.. కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. తమ పాలనలో బెంగాల్‌లో నిరుద్యోగిత రేటు 40శాతం తగ్గిందని సీఎం తెలిపారు. ప్రభుత్వం దాదాపు 40లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించిందని.. వారిలో 10లక్షల మంది ఇప్పటికే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇప్పటికే ఏడాదికి రూ.10వేలు ఇస్తోందన్నారు.



## దుబాయ్‌లో బంగారంపై రాయితీ

- ఔన్సుకు 30 డాలర్ల వరకు
- రవాణా ఆటంకాల నేపథ్యం

**ముంబై:**పండగలు-ప్రత్యేక సందర్భాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, దుస్తుల వంటివి రాయితీపై అమ్మడం చూస్తుంటాం. అయితే ఇరాన్ యుద్ధం ఫలితంగా విమానాలు - నౌకా రవాణాకు ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో, దుబాయ్‌లో బంగారాన్ని కూడా రాయితీపై అమ్మేస్తున్నారు. అధిక వ్యయాలకు తోడు డెలివరీల్లో అనిశ్చితి వల్ల కొనుగోలుదార్లు వెనుకడుగు వేస్తుండటమే ఈ పరిస్థితికి కారణం. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధరపై 30 డాలర్ల (రూ.2,700కు పైగా) వరకు తక్కువకే ఇచ్చేస్తున్నారని సమాచారం. దుబాయ్ నుంచి కొన్ని బంగారం డెలివరీలు అవుతున్నా, మరికొన్ని ఆలస్యం అవుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర శుక్రవారం 5147 డాలర్ల వద్ద ఉంది. అంతర్జాతీయంగా లోహం రూపంలో బంగారం వ్యాపారానికి దుబాయ్ కేంద్రంగా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లోనూ దాడులు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా విమాన సర్వీసులు అరకొరగా నడుస్తున్నాయి. అందువల్ల దుబాయ్ నుంచి బంగారాన్ని వివిధ దేశాలకు డెలివరీ చేయడానికి ఆటంకాలేర్పడుతున్నాయి. ఫలితంగా కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు కొనుగోలుదార్లు (బులియన్ వ్యాపారులు/సంస్థలు) ముందుకు రావడం లేదు. డెలివరీ వ్యయాలు - బీమా ఖర్చులు గణనీయంగా పెరగడంతో పాటు, సమయానికి సరకు చేరుతుందన్న నమ్మకం కొరవడటమే ఇందుకు కారణం. బంగారంపై పెట్టిన పెట్టుబడులను దీర్ఘకాలం వృథాగా ఉంచడం ఇష్టం లేకే, దుబాయ్ వ్యాపారులు అంతర్జాతీయ ధర కంటే తక్కువకే అమ్మేందుకు సుముఖత చూపుతున్నారు. ఈ వారంలో కొన్ని డెలివరీలు తరలిపోయినా, శుక్రవారం కూడా పెద్దమొత్తంలో నిల్వలు దుబాయ్‌లో ఉండిపోయినట్లు సమాచారం.

**పసిడి తరలింపు ఇలా**

ప్రయాణికుల విమానాల్లోనే సరకు తరలింపునకు ఉండే చోటులోనే, సురక్షితంగా పసిడిని కూడా పంపుతుంటారు. యూఏఈ విమానాల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతున్నా కూడా, సౌదీ అరేబియా - ఒమన్ దేశాల విమానాశ్రయాలకు పంపి, అక్కడ నుంచి వివిధ దేశాలకు బంగారం తరలించేందుకు ట్రేడర్లు - రవాణా సంస్థలు విముఖత చూపుతున్నాయి. బంగారం ధర ఔన్సు 5,100 డాలర్లకు మించి ఉన్న నేపథ్యంలో, దేశాల



సరిహద్దులను దాటించేందుకు అవరోధాలు ఏర్పడుతుండటమే ఇందుకు కారణం.

**దేశీయంగా గిరాకీ అరకొరగానే**

యూఏఈ నుంచి డెలివరీలు స్తంభించడం లేదా ఆలస్యం అవుతున్నాయి. ఇందువల్ల స్వల్పకాలానికి మనదేశానికి వచ్చే బంగారం తక్కువగానే ఉంటుందని పరిశోధనా సంస్థ ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ అధిపతి రేనీషా చైనాని తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా పసిడికి గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నందున, మనదేశం నుంచి ఆర్డర్లు పెట్టిన వారు కూడా వేచిచూసేందుకు ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. జనవరిలో అధికంగా బంగారం దేశంలోకి దిగుమతి అయినందున, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించారు. గనుల నుంచి పసిడి రిఫైనరీలకు వచ్చే ముడి బంగారం లభ్యత తగ్గుతోంది. దేశీయ అతిపెద్ద లోహ రిఫైనరీ ఎంఎంటీసీ-పాంప్‌నకు పశ్చిమాసియా గనుల నుంచి 10% బంగారం దోరె వస్తుంటుంది. ఇందులోనూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. యుద్ధం ప్రారంభమయ్యాక, ఇతర ప్రాంతాల నుంచి సరఫరా వ్యయాలు కూడా 60-70% అధికమయ్యాయని ఎంఎంటీసీ-పాంప్ ఎండీ సుమిత్ గుహ వెల్లడించారు.

**మేలిమి పుత్తడికి ప్రసిద్ధి**

గనుల నుంచి వచ్చిన పసిడిని శుద్ధి చేసి, మేలిమి బంగారం రూపంలో ఆసియా దేశాలకు ఎగుమతి చేయడంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రధాన కేంద్రంగా ఉంది. స్విట్జర్లాండ్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్, ఆఫ్రికా దేశాలకు కూడా యూఏఈ మీదుగానే పసిడి రవాణా అవుతోంది. ఇరాన్ క్షిపణులు ప్రయోగిస్తున్నందున, దుబాయ్ గగనతలాన్ని కూడా పాక్షికంగా మూసివేయడంతో, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడుతోంది. చిక్కుకుపోయిన ప్రయాణికులను తీసుకెళ్లేందుకు భారత్ నుంచి కూడా ప్రత్యేక విమాన సర్వీసులను నిర్వహిస్తున్న సంగతి విదితమే.

## క్యాన్సర్‌ను జయించి.. సివిల్స్ సాధించి

**న్యూఢిల్లీ:**ఆరేళ్లు క్యాన్సర్‌తో పోరాడాడు. స్వల్ప దృష్టి లోపంతో బాధపడుతున్నాడు. లక్ష్యం కోసం మూడు ఉద్యోగాలకు రాజీనామా చేశాడు. సివిల్స్‌లోనూ రెండుసార్లు ఆశించిన ఫలితం రాలేదు. అయినా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. పట్టుదలతో ప్రయత్నించాడు. చివరకు అనుకున్నది సాధించాడు. మూడో ప్రయత్నంలో సివిల్స్‌లో మెరిశాడు. అతడే ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లాకు చెందిన సంజయ్ దహరియా బేల్‌టుక్రి గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ కుటుంబంలో సంజయ్ దహరియా (38) జన్మించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అతడి విద్యాభ్యాసం ప్రారంభమైంది. అనంతరం రాయ్‌పుర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. చదువు పూర్తి చేసుకున్న అనంతరం ఎస్‌బీఐలో ఉద్యోగం సాధించాడు. 2009 నుంచి 2011 వరకు పశ్చిమ బెంగాల్‌లో పనిచేశాడు. ఆ తర్వాత సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు.అంతలోనే ఊహించని పరిస్థితి ఎదురైంది. 2012లో క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. దాదాపు ఆరేళ్లపాటు మహమ్మారిపై పోరాడి, గెలిచాడు. స్వల్ప దృష్టి లోపంతో బాధపడుతున్నప్పటికీ.. ఏమాత్రం నిరుత్సాహపడకుండా సివిల్ సర్వీసెస్ కోసం




ప్రయత్నాలు కొనసాగించాడు. ఒకవైపు పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే.. మరోవైపు రాయ్‌పుర్‌లోని ఓ బ్యాంకులో, ఆపై మహాసముంద్‌లోని పోస్టాఫీసులో ఉద్యోగాలూ చేశాడు. 2022లో తొలిసారి సివిల్స్ పరీక్ష రాశాడు. ఆశించిన ఫలితం రాలేదు. రెండో ప్రయత్నంలోనూ నిరాశే ఎదురైంది. తాజాగా మూడో ప్రయత్నంలో 946వ ర్యాంకు సాధించాడు."సివిల్ సర్వీసెస్ ద్వారా దేశానికి సేవ చేయాలని ఆశిస్తున్నాను. ఏ సర్వీస్ వచ్చినా.. ప్రజా సేవ విషయంలో నిబద్ధతగా వ్యవహరిస్తాను" అని సంజయ్ తెలిపాడు. అనారోగ్యంతో ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, మెంటార్‌లు అండగా నిలిచారని, వారు అందించిన మద్దతే విజయానికి కారణమని చెప్పాడు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై.. మహాసముంద్ కలెక్టర్ వినయ్ కుమార్ తదితరులు సంజయ్‌ను అభినందించారు.


కరీంనగర్ కోర్టు సిబ్బంది

# అటు ఇటు అన్నింటా...
# నీవే జగమంతా..

## విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో రాణిస్తున్న స్త్రీమూర్తులు

### నేడే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకత కథనం

ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుంచుకొని ఆమె జగజ్జేతగా ఎదుగుతోంది. అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఆలిగా, కుటుంబ బాధ్యతల్లో మునిగి తేలుతున్న ఆమె ఉద్యోగినిగా, ప్రజాప్రతినిధిగా దక్షత చూపుతోంది. మదుపరులుగా సామాన్య మహిళలు కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహంతో చిరు వ్యాపారాల్లో, చిన్న, మధ్యా తరహా పారిశ్రామిక వేత్తలుగా ఆర్థిక సాధికారత వైపు అడుగులు వేస్తున్నారు. అసామాన్య ప్రతిభతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇంటిని చక్కదిద్దిన చేతులతో నవసమాజాన్ని తీర్చిదిద్దుతున్నారు. జగతికి వెలుగులు పంచుతున్న 'అమృతమూర్తులు జగజ్జేతలు' అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

హుజురాబాద్, మార్చి 7 (జనం సాక్షి ) :

**మహిళలు సమాజానికి వెన్నెముక:**
వాసంశెట్టి మాధవి, ఏసీపీ హుజూరాబాద్

మహిళలు సమాజానికి వెన్నెముక లాంటి వారు. ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వం ఇలా ఏదైనా సరే మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారు. మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నప్పుడే వారు ఎలాంటి కుంగుబాట్లకు లోనుకారు. హుజూరాబాద్ డివిజన్ ప్రాంతాన్ని మహిళలకు సురక్షిత ప్రదేశంగా మార్చేందుకు అవిశ్రాంతంగా పని చేస్తున్నాం. మహిళలకు ఎలాంటి సహాయ సహకారాలనైనా అందించేందుకు ముందుంటాం. మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

**ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి:**
రొంటాల సుహాసిని, మున్సిపల్ చైర్ పర్సన్ హుజూరాబాద్

ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళలు చదువుకు ప్రాధాన్యమివ్వాలి. నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలి. ఆత్మనూన్యతాభావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. పురుషుల కన్నా ఏ విషయంలోనూ తక్కువ కాదని నిరూపించుకోవాలి. స్వశక్తిని నమ్ముకున్న మహిళలకు సమాజంలో అద్భుత అవకాశాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి జరుగుతుంది. తొలిసారిగా మున్సిపల్ ఎన్నికల్లో 30వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికై మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎంపికయ్యాను. హుజూరాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేసే అవకాశం రావడం ఆనందంగా భావిస్తున్న.

**ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి:**
వంతడుపుల కస్తూరి, సర్పంచ్ చెల్పూర్

ఎంచుకున్న రంగంలో రాణించేందుకు మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. ప్రస్తుత సమాజం తీరును బట్టి మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు. ఇంట్లో ఉండే మహిళలైనా సరే ఏదో ఒక రంగంలో రాణించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తే విజయం సాధించడం చాలా సులభం. స్వయం ఉపాధిని పొందేందుకు చేతి వృత్తులు వంటిని నేర్చుకొని కుటుంబానికి అండగా నిలబడవచ్చు. మహిళల్లో కూడా తాము సాధించగలం అనే నమ్మకం పెరుగుతుంది. నేను మొదటి సారిగా చెల్పూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికయ్యాను. గ్రామ అభివృద్ధికి, ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది.

**సురక్షిత సమాజం అవసరం :**
పూసల ప్రభావతిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు

మహిళలు, బాలికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించినప్పుడే సురక్షిత సమాజం ఆవిర్భవిస్తుంది. ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, రహదారులతో పాటు అనేక చోట్ల ఎక్కడపడితే అక్కడ లైంగిక హింస, వేధింపులు ప్రతిరోజు అధికంగా పెరిగిపోతున్నాయి. అసాంఘిక శక్తుల పట్ల నామమాత్రపు చర్యలు, కంటితుడుపు చట్టాలతో ప్రపంచవ్యాప్తంగా మహిళా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. దేశంలో మహిళా చట్టాలను మరింత పటిష్టం చేయాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలకు తోడుగా ప్రత్యేకమైన ఆర్డినెన్స్ ను తీసుకురావాలి. నిత్య జీవితంలో మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న వేధింపులకు చరమగీతం పాడే విధంగా చొరవ చూపాలి. నేటి యువతులు తమ గళాన్ని నిర్భయంగా విన్పించి సమాజాన్ని చైతన్యవంతం చేసి ఆదర్శవంతంగా నిలపాలి.


చల్మెడ హాస్పిటల్ సిబ్బంది డిఎంహెచ్ఓకి

## అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం

### సాధించిన విద్యార్థిని సన్మానించిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బాన్సువాడ గ్రామానికి చెందిన విద్యార్థి శశిధర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్న శశిధర్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ చాటుకున్నాడన్నారు ఇప్పటివరకు శశిధర్ 15 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో, 7 సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇటీవల 14.నుండి 19 వరకు ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో ఇండియా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడనీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశిధర్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో కూడా రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లోయపల్లి చిన్న నర్సింగ్ రావు, కార్యదర్శి కృష్ణమూర్తి, నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కోశాధికారి రాజేశ్వర్, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, శశిధర్ తండ్రి శివ రాజులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికతో ప్రభుత్వం కొత్త డ్రామాకు శ్రీకారం

- కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలి
- ఏఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి డిమాండ్



**కరీంనగర్ బ్యూరో, మార్చి 07 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక -99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం కొత్త డ్రామాకు శ్రీకారం చుట్టినట్టేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రకటించిన ఈ 99 రోజుల ప్రణాళికలో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదన్నారు. 99 రోజుల వ్యవధిని ప్రభుత్వం ఏ ప్రాతిపదికన నిర్ణయించిందో ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఎంత బడ్జెట్ కేటాయించిందో వివరాలు వెల్లడించాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, కూలీలు, యువత, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. రైతులు పంటలకు నీళ్లు లేక ఇబ్బందులు పడుతుండగా, యువతకు ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజల అసలు సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసి కొత్త సంక్షేమ పథకాలు ప్రకటించాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్ పై జిల్లాల వారిగా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

## పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

### కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తోంది : సిబిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
### వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సీపీఎం పిలుపు

**ముషీరాబాద్, మార్చ్ 07 (జనం సాక్షి):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తూ గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.60లు, కమర్షియల్ సిలిండర్ ధరను రూ.115లు పెంచడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలపై వేస్తున్న ఈ భారానికి నిరసనగా నేడు (ఆదివారం) రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఇప్పుడు గ్యాస్ ధర పెంచడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అదనపు భారమవుతున్నదనీ, దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ, పేదప్రజలపై అదనపు భారాలు విధించే కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. తక్షణమే పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరల అదుపుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. పెంచిన ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా రేపు జరిగే నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నగరంలో కాలువ పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి

- రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..
- రామగుండంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**గోదావరిఖని, జనం సాక్షి:** నగరంలో చేపట్టిన కాల్వ పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండంలో విస్తృతంగా పర్యటిం చారు. గోదావరిఖని పట్టణం లోని 49 డివిజన్ మార్కండేయ కాలనీలో జరుగుతున్న కాల్వ పూడికతీత పనులు, ఎన్టిపిసిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, రామగుండం లోని జడ్పీహెచ్ ఎస్ పాఠశాల, రామగుండంలోని లింగాపూర్ సమీపంలోని రోడ్డు విస్తరణ పనులు, పైప్ లైన్ పనులు, రామగుండం లోని మండల పశు వైద్యశాల, రామగుండం లోని సబ్ రిజిస్టర్ కార్యాలయం, అంతర్గాం మండలంలోని కుందనపల్లి కేజీబీవీలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గోదావరిఖని పట్టణంలోని కాలువ పూడిక తీత పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రామగుండం లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదులు, కాంపౌండ్ వాల్, భోజనశాల, పనులను వచ్చే మే మాసం నాటికి పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అన్నారు. కేజీబీవీ కుందనపల్లిలో డార్క్ ఏరియా లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, కోతులు సమస్యలు తలెత్తకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, గ్రౌండ్ లెవెలింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మస్జిద్ చౌరస్తా నుండి లింగాపూర్ వరకు చేపట్టిన 4 లైన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఆటంకంగా ఉన్న పైప్ లైన్ తరలింపు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పశు వైద్యశాలలో సిబ్బంది విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వేసవి దృష్ట్యా త్రాగునీరు అందుబాటులో పెట్టాలని, స్లాట్ ప్రకారం రిజిస్ట్రేషన్ సకాలంలో అయ్యేలా చూడాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ శాఖ డీఈ అప్పల్ నాయుడు, ఏఈ రాజ్ కుమార్, రోడ్లు భవనాలు శాఖ ఏఈ జావిద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై భారత ప్రభుత్వం మౌనం వీడాలి

### ఆల్ ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ పాషా




**ముషీరాబాద్, మార్చ్ 07 (జనం సాక్షి):** ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై భారత ప్రభుత్వం తమ మౌన వైఖరి వీడాలని ఆల్ ఇండియా తంజీమ్ ఇన్సాఫ్ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్ పాషా అన్నారు. ఇరాన్ ఇజ్రాయెల్ సంయుక్త దాడిని ఖండిస్తూ ఇన్సాఫ్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్క్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కేవలం 5 రోజుల్లోనే అమాయకుల ప్రాణాలు బలితీసుకోవడంతో పాటు 3 లక్షలకు పైగా ప్రజలను నిరాశ్రయులను చేసిందని విచారం వ్యక్తం చేశారు. యుద్ధం ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం చమురు ధరలను ఇప్పటికే 20 శాతం పెంచిందని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బాంబు దాడుల నుండి తమను తాము రక్షించుకోవడానికి ఇరాన్ ప్రజలు 11,770 షెల్టర్లు, బంకర్లను నిర్మించుకుని, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నారని వివరించారు. అమెరికా మిత్రదేశమైన స్పెయిన్, ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఇరిస్డెనా నౌక లక్ష్యంగా 80 మంది భారతీయ సైనికులను అమెరికా హతమార్చినప్పటికీ, అమెరికా-ఇజ్రాయెల్ దురాగతాలపై భారత ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమని అజీజ్ పాషా అన్నారు. ఇరాన్ నాయకుడిని తమ ఇష్టానుసారం ఎంపిక చేసుకోవాలన్న మూర్ఖపు వాదనపై సీనియర్ న్యాయవాది ఎండి.అఫ్జల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు వెంటనే ఐక్యరాజ్య సమితి కలుగజేసుకుని, ఇరు దేశాలతో చర్చలు జరిపి యుద్ధాన్ని నివారించే చర్యలు చేపట్టాలని నిరసనకారులు కోరారు. కార్యక్రమంలో తంజీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్, ఎఐవైఎఫ్ నాయకులు బాలకృష్ణన్, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎస్ తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ పరిధిలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు

**శేరిలింగంపల్లి ఫిబ్రవరి 07 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే గొప్ప లక్ష్యంతో తదనుగుణ ప్రణాళికలు, పలు చర్యలు చేపట్టేందుకు అధికారులంతా సమాయత్తమవుతున్నారు. ఈ కార్యక్రమంద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేయడం, సమాజంలో మాదకద్రవ్యాలను నిర్మూలించడమే ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు శనివారం వివరించారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని కళాశాలలు, పాఠశాలలు, మాల్స్, గేటెడ్ కమ్యూనిటీలు, పబ్లిక్ ప్లేసెస్, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు, యువతకు, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలు, ఆరోగ్యపరమైన నష్టాలు, చట్టపరమైన పరిణామాల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి జీవితానికేకాకుండా కుటుంబం, సమాజానికి కూడా తీవ్రమైన తలనొప్పులు, ఇబ్బందులతోపాటు సమస్యలను సృష్టిస్తుందని, తద్వారా ఆయా కుటుంబాలలో చీకటి అలుముకోవడం ఖాయమని అధికారులు ఆహుతులకు తెలియజేశారు. క్షణిక సుఖం కోసం, ఆనందం కోసం విచక్షణ కోల్పోవద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. డ్రగ్స్ విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసు హెచ్చరించారు. సమాజంలో డ్రగ్స్ వ్యసనాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరేందుకు నిరంతరం శ్రమించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల బ్యూరో, మార్చి 7 (జనంసాక్షి) :** కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనంలో విద్యార్థులకు అందిస్తున్న కామన్ మెనూ ప్రకారం వండుతున్న ఆహారాన్ని పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు తదితర అంశాలను సమీక్షించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు మరియు ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, పదో తరగతి విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం తీసుకుంటున్న ప్రణాళికలపై అక్కడి స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక తరగతులు, రివిజన్ ప్లాన్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు తెలుసుకుని, కమిటీ సమావేశాలు నియమితంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటి ంచి పాఠశాలలో కల్పిస్తున్న అన్ని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠ్యంశాల్లోని పలు ప్రశ్నలు అడిగి వారి చదువు, లక్ష్యాలు, ఆశయాల గురించి తెలుసుకుని ప్రోత్సహించారు. చదువును ఇష్టంతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకొని మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం, వసతి సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, డిపివో మదన్ మోహన్, ఎంపిడివో స్వరూప రాణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




## సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలను జాగృతం చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7 (జనం సాక్షి) :** మహిళా దినోత్సవ సందర్భంగా కామారెడ్డి అడిషనల్ ఎస్పీ బి. చైతన్య రెడ్డి ని సన్మానించిన సహ చట్ట రాష్ట్ర మహిళా ప్రతినిధులు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ బి. చైతన్య రెడ్డిని శనివారం సమాచార హక్కుచట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ సలీం, రాష్ట్ర మహిళా కార్యదర్శి లతారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా బేగం లు శాలువాతో పూల బొకెతో ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ బీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నందుకు కృషి చేస్తున్న సహచట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం ఏ సలీం, ప్రతినిధులను అభినందించారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సమాచార హక్కు చట్టం 2005 బోర్డులు ఉన్నాయని తెలియజేస్తూ ప్రజలు వారికి కావలసిన సమాచారాన్ని నేరుగా ఆయా పోలీస్ స్టేషన్లలో సెక్షన్ 6(1) ప్రకారం గా దరఖాస్తు చేసుకుంటే 30 రోజులలో వారికి కావాల్సిన సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారులు అందజేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ సలీం, తెలంగాణ రాష్ట్ర మహిళా కార్యదర్శి న్యాయవాది ఎన్. లతా రెడ్డి, స్థానిక ఏజిపి షబానా బేగం, జిల్లా సలహాదారులు ఎం. నాంపల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వి భాస్కర్, జిల్లా ప్రతినిధులు శ్రీనివాస్, సుధాకర్, ఎస్ లింబయ్య, ప్రదీప్ కుమార్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

సమస్త ప్రజలకు తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ కె.రాజేందర్ గౌడ్ తండ్రి వెంకట్రాము లు గౌడ్ R/o నారాయణపేట, పట్టణంలో సర్వే నెంబర్ 455 లో ఒక ప్లాట్ శిప్లాట్ నం.-2రి కలదు తేదీ-06-03-2026 నాడు అట్టి ప్లాట్‌కు సంబంధించిన, సంబంధిత ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ నంబర్ 1566/2002, ను జిరాక్స్ కాఫీ తీసుకోనుటకు కోర్టు ముందు ఉన్న జిరాక్స్ సెంటరు వెళ్తుండగా పడిపోయి నవి. సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన చో తెచ్చి ఇవ్వగలరని మనవి, ఏమైనా అభ్యంత రాలు ఉన్నచో ఏడు రోజులలో తెలుపగలరు. దీనికి గాను తేదీ 06-03-2026 నాడు సంబంధిత పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది


**సి.విజయ భాస్కర్ రెడ్డి, క్రాంతి కుమార్**
**న్యాయవాదులు**
ఇంటి నెం: 1-5-31/75, ఆర్టీసీ కాలనీ
"X" రోడ్డు నారాయణపేట-509210,
సెల్: 9440873257

# కక్షిదారులకు సత్వర న్యాయానికి అన్ని వసతులు

- నూతన కోర్టు భవన సముదాయాలు
- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 07 (జనంసాక్షి) :** కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ తెలిపారు.సిరిసిల్లలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో 12 రకాల న్యాయస్థానాలు సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు శైలిలో నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన లో పాల్గొనగా, సిరిసిల్లలో హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్వ మత ప్రార్థనలు చేసి.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నూతన కోర్టు భవన సముదాయం అన్ని కోర్టుల నిర్వహణకు సరిపోయే విధంగా ఉంటుందని వెల్లడించారు. నూతన కోర్టులో మౌలిక వసతులతోపాటు తగినంత సిబ్బంది ఉండాలని సూచించారు సిరిసిల్ల జిల్లాకు భౌగోళికంగా, పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయం జీవనోపాధితో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు.ఇక్కడ చేనేత పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి పొందింది అని పేర్కొన్నారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కోర్టులో 13 వేల కేసులు పైగా కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు. పెండింగ్ కేస్ ల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంబంధిత అధికారులు సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు.ఈ నూతన కోర్టు భవన నిర్మాణం ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ పేర్కొన్నారు. రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి పౌరుడికి సామాజిక న్యాయం అందేలా న్యాయవ్యవస్థ పని చేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చరిత్ర, సంస్కృతి, పరిశ్రమలతో ప్రసిద్ధి పొందిన ప్రాంతం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ పేర్కొన్నారు పెద్ద టెక్స్టైల్ పవర్ లూమ్ కేంద్రంగా ఎదిగి వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు.సిరిసిల్లను పవర్‌లూమ్ నగరంగా కూడా పిలుస్తారనీ. ఇక్కడ వేలాది మంది నేత కార్మికులు పగలు రాత్రి శ్రమించి దేశవ్యాప్తంగా పేరు పొందిన వస్త్రాలను తయారు చేస్తున్నారని తెలిపారు. సిరిసిల్లలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రాలలో ఒకటి తెలిపారు.



# ఆకలి ముందు ప్రాణం కూడా చిన్నదే

### ఉప్పల్ రింగ్‌రోడ్‌పై హృదయ విదారక దృశ్యం

**ఉప్పల్, మార్చి 07 (జనం సాక్షి):** నగరంలోని ఉప్పల్ రింగ్‌రోడ్ వద్ద నిన్న రాత్రి కనిపించిన ఓ హృదయ విదారక దృశ్యం ప్రజల మనసులను కదిలిస్తోంది. నడిరోడ్డుపై పడిపోయిన అన్నాన్ని ఒక వృద్ధురాలు కూర్చొని తింటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చెక్కర్లు కొడుతూ అందరినీ కలచివేస్తోంది. సమాచారం ప్రకారం, నిన్న రాత్రి ఉప్పల్ రింగ్‌రోడ్ ప్రాంతంలో ఒక వృద్ధురాలు నడిరోడ్డుపై కూర్చొని కనిపించింది. ఎక్కడో పడిపోయిన అన్నాన్ని చేతులతో తీసుకుంటూ ఆకలితో తింటున్న ఆమె పరిస్థితి చూసిన వారందరూ క్షణం పాటు దిగ్భ్రాంతికి గురయ్యారు. వేగంగా దూసుకుపోతున్న వాహనాల మధ్య, ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా ఆకలితో అలమటించిన ఆ వృద్ధురాలు రోడ్డుపైనే కూర్చొని ఆహారం తింటున్న దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి హృదయాలను ముక్కలు చేసింది. ఈ ఘటనను అక్కడ ఉన్న కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించగా, ఆ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీడియోను చూసిన పలువురు నెటిజన్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ "ఇంతటి మహానగరంలో కూడా ఒక వృద్ధురాలు ఇలా ఆకలితో రోడ్డుపైనే పడిపోయిన అన్నం తినాల్సిన పరిస్థితి రావడం ఎంతో బాధాకరం" అని వ్యాఖ్యానిస్తున్నారు. ఆకలి ఎంతటి దారుణమైన బాధనిస్తుందో ఈ దృశ్యం స్పష్టంగా తెలియజేస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో నిరాశ్రయులు, వృద్ధుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని చెబుతున్నారు.ఈ వీడియో చూసిన తర్వాత చాలామంది సామాజిక మాధ్యమాల ద్వారా ఆ వృద్ధురాలిని గుర్తించి ఆమెకు సహాయం చేయాలని కోరుతున్నారు. ఇలాంటి బాధాకర పరిస్థితుల్లో ఉన్న నిరాశ్రయులకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత సహాయం అందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### మంత్రి పొన్నం చిత్తశుద్ధితో

# గౌరవెల్లి ప్రాజెక్టు నీరందించాలి

### అభివృద్ధిలో వివక్ష చూపితే చూస్తూ ఊరుకోం : మాజీ ఎమ్మెల్యే వొడితేల సతీష్ కుమార్



**చిగురుమామిడి మార్చి 07 (జనంసాక్షి) :** రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని,పక్షపాత వైఖరి మానుకొని చిత్తశుద్ధితో గౌరవెల్లి ప్రాజెక్టు నుండి రైతులకు సాగు నీరు అందించాలని, అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో సహకరిస్తామని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ అరకొర పనులు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. చిగురుమామిడి,సైదాపూర్ మండలాలకు తోటపల్లి రిజర్వాయర్ ద్వారా 23 వేల ఎకరాల కు సాగునీరు అందించామని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి సైతం గోదావరి జలాలను చూసి సొంత గ్రామం రేకొండలో సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో తప్ప చేతుల్లో పనులు లేవని ఎద్దేవా చేశారు. పార్టీ గుర్తులకు అతీతంగా ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్లకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని, కేవలం కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికి మాత్రమే గ్రామాల్లో నిధులు మంజూరు చేయడం ఏంటని మంత్రిని ప్రశ్నించారు. హైదరాబాద్ కు ఇన్చార్జి మంత్రిగా పరిమితమేనా లేక నియోజకవర్గం అభివృద్ధి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ,మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, సింగిల్ విండో మాజీ చైర్మన్ జంగా రమణారెడ్డి,ఆర్‌బీఎస్ మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి,సాంబారి కొమురయ్య,సర్పంచ్లు ఆకవరం భవాని,సన్నీల కవిత వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.
ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు

# ప్రజల కష్టాలు తీర్చేందుకే ప్రజల ముందుకు వస్తున్న

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అందుతుంది
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వ్యవస్థకు స్వస్తి
- అసెంబ్లీ సమావేశాలనంతరం 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు



**ఇబ్రహీంపట్నం మార్చి 07 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజల వద్దకే పాలన అందుతుందని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చెప్పారు. పోచారం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల కష్టాలను తీర్చేందుకే ప్రజల ముందుకు వస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వ్యవస్థకు స్వస్తి పలకడం కోసమే ఈ బృహత్తర కార్యక్రమం అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం అర్హులైన ప్రజలకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పోచారంలో రైస్ మిల్, ప్లైవుడ్ ల నుండి కాలుష్య సమస్య తలెత్తుతుందని విషయాన్ని ప్రజలంతా తమ దృష్టికి తీసుకొచ్చారని పొల్యూషన్ బోర్డ్ అధికారులతో సత్వరమే చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇది ప్రజాప్రభుత్వం ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ప్రజాప్రతినిధులు , అధికారులు అయినా అందరం పని చెసేది ప్రజలకోసమే అన్నారు. ప్రజలకు ప్రతీ అధికారి జవాబుదారి తనంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు అందేల చూడటం అధికారుల బాధ్యత అన్నారు. గ్రామాలలో అండర్ డ్రైనేజి వ్యవస్తను మెరుగుపరచాలన్నారు. గ్రామాలలో క్రమం తప్పకుండ సానిటైజింగ్ చేయించాలన్నారు. అధికారులు అర్హులైన ప్రతీ ఒక్కరిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేష్,ఉపసర్పంచ్ కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బాలశంకర్ , వివిధ శాఖల అధికారులు గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి చిన్న పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7 (జనం సాక్షి) :** నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు,వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మి పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సన్నద్ధం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన 99 రోజుల సన్నహగ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,మార్చి 07(జనంసాక్షి) :** 99 రోజుల కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా యంత్రంగం అనే ఏర్పాట్లు చేసి పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం హాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 99 రోజుల ప్రోగ్రాం సన్నాహక కార్యక్రమానికి పెద్దపెల్లి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందని అన్నారు. ప్రతి అధికారికి నిర్దిష్టంగా బాధ్యతలు అప్పగించామన్నారు. 99 రోజుల కార్యక్రమం తర్వాత ప్రజలకు స్పష్టమైన మార్పు కనిపించే దిశగా పెద్దపల్లి జిల్లాలో కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా పెద్దపల్లి జిల్లాలో అవసరమైన చర్యలు మంత్రిల సూచనలు ఆదేశాల మేరకు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డి.వేణు, జే.అరుణశ్రీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, మార్చి 07 (జనంసాక్షి) :** సమాజ నిర్మాణంలో కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర విశిష్టమైనదని వారు ప్రేమ, సహనానికి ప్రతీకని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్త్రీ అభివృద్ధికి నాంది పలుకుతుందని, కుటుంబ పోషణలో చాలా కీలక పాత్ర పోషిస్తున్నది వారు చెప్పారు. మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడానికై మహిళా దినోత్సవా న్ని జరుపుతారని శనివారం రోజున సమాజాభివృద్ధికి నేటి కాలంలో మహిళలు ఉద్యోగంలో సైతం రాణిస్తున్నారని ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం చాలా గొప్ప విషయమని వారు తెలిపారు కుటుంబం సమాజం బాగుండాలంటే స్త్రీల పాత్ర సంరక్షించాలని వానికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని వారు అభిప్రాయపడ్డారు. స్త్రీలు లేని సమాజాన్ని ఊహించలేమని, నేడు వ్యాపారాలను రాజకీయాల్లో సైతం రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వారు కొనియాడారు. భారత దేశంలో నేడు రాణిస్తున్న పలు మహిళలను వారు ప్రశంసించారు ప్రధానంగా వ్యాపార రంగంలో సుధా నారాయణమూర్తి క్రీడారంగంలో హర్మన్ ప్రీత్ కౌర్ తదితరులు ఆదర్శంగా నిలుస్తున్నారని వారు కొనియాడారు. వేడుకలలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుపై అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి మహిళా బోధన, బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 26 మంది వికలాంగులకు స్కూటీలు పంపిణీ

- ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
- ఎద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



**పెద్దపల్లి,మార్చి 07(జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మహిళా సోదరిమణులను సన్మానించిన పెద్దపల్లి శాసనసభ్యులు.చింతకుంట విజయరమణ రావు ముందుగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 10 లక్షల రూపాయలతో మున్సిపల్ వారు కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్ ట్రాలీలను ప్రారంభించి అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 40 లక్షల రూపాయలతో 26 మంది వికలాంగులకు (టి వి ఎస్)జుపిటర్ స్కూటీలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయరమణ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు. రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా పని చేస్తున్నారని మహిళలను అన్ని రంగాల్లో రాణించడం జరుగుతుందని ప్రతి మహిళను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని అందుకు మహిళలకు అన్ని రంగాల్లో ముందుండి వారి ప్రతిభను గుర్తించి వారికి అవకాశాలను కల్పించడం జరుగుతుందని రాజకీయాల్లోనూ ప్రభుత్వపరంగా ఐపీఎస్ ఐఏఎస్ అధికారులుగా రాణిస్తున్నారని అన్నారు. మెప్మా సోదరీమణులకు ఈ సందర్భంగా మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం పెద్దపల్లి మున్సిపల్ తరఫున పది లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్ ట్రాలీలను ప్రారంభించడం జరిగింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నుగిళ్ళ మల్లన్న, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్, మున్సిపల్ కమిషనర్ మరియు కౌన్సిలర్లు మరియు వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కూర మల్ల రెడ్డి,జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణు గోపాల్, మున్సిపల్ అధికారులు, మెప్మా మహిళలు, మున్సిపల్ కౌన్సిలర్, మరియు సర్పంచ్ లు అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా నిరోధానికి సాలూర వద్ద చెక్ పోస్ట్

### టీజిఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా



**బోధన్, మార్చి 7 (జనంసాక్షి) :** పొరుగు రాష్ట్రాల నుండి ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అడ్డుకునేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిజామాబాద్ జిల్లా సరిహద్దులోని సాలూర వద్ద టీ.జీ.ఎం.డీ.సీ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్ ను నెలకొల్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా చెక్ పోస్ట్ ను శనివారం లాంచనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ చెక్ పోస్ట్ వద్ద వేయింగ్ మెషిన్ తో ఇసుక వాహనాల తనిఖీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా అక్రమ ఇసుక రవాణాతో పాటు, ఓవర్ లోడింగ్ ను సైతం నిరోధించేందుకు ఆస్కారం కలిగిందని ఎం.డీ భవేష్ మిశ్రా ఈ సందర్భంగా వెల్లడించారు. ఆన్లైన్ లో బుకింగ్ చేసుకుని మహారాష్ట్ర నుండి నిర్ణీత పరిమాణంలో నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించవచ్చని, అయితే సాలూర చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇదివరకు చెక్ పోస్ట్ లేకపోవడం వల్ల ఇసుక రవాణా విషయంలో పలు అక్రమాలు జరిగేవని, ఈసారి అలాంటి వాటికి ఆస్కారం లేకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సాలూర వద్ద జిల్లా యంత్రాంగం సహకారంతో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివల్ల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుందని తెలిపారు. అంతేకాకుండా ఓవర్ లోడ్ సమస్యను నిరోధించడం ద్వారా రోడ్లు చెడిపోకుండా, రోడ్డు ప్రమాద సంఘటనలు జరుగకుండా నిలువరించవచ్చని అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ కు సమీపంలోనే మహారాష్ట్ర ఇసుక క్వారీలు ఉన్నందున ఇసుక అవసరమైన వారికి తక్కువ ధరకే ఇసుక లభ్యం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంజీరాలో ఇసుక తవ్వకాలకు సంబంధించి సరిహద్దు సమస్య తలెత్తకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ భూభాగాన్ని గుర్తిస్తూ స్పష్టంగా సరిహద్దులు ఏర్పాటు చేశామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని, ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని ఆదేశించడం జరిగిందని గుర్తు చేశారు. ఇసుక తవ్వకం, రవాణాలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటికే నిజామాబాద్ సహా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని ఎం.డీ భవేష్ మిశ్రా గుర్తు చేశారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చెక్ పోస్ట్ నిర్వహణ సజావుగా జరగాలని, గట్టి నిఘాను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏ.డీ సంజయ్, ల్యాండ్ అండ్ సర్వే ఏ.డీ అశోక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారుల పోషణ, ఆరోగ్యంపై అంగన్వాడి ముఖ్య పాత్ర

### అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు



**బోధన్, మార్చి 8 (జనంసాక్షి) :** బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ సందర్శించారు. అంగన్వాడి కేంద్రంలోని కిచెన్ గార్డెన్‌ను, పరిసరాలను పరిశీలించిన ఆమె అక్కడ నిర్వహణ బాగుందని ప్రశంసించారు. చిన్నారుల పోషణ, ఆరోగ్యంపై అంగన్వాడి కేంద్రాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని ఆమె తెలిపారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రేమలత అగర్వాల్ మాట్లాడుతూ, ఆడపిల్లల విద్య ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల విద్య, భద్రత, అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహం చట్టపరంగా నేరమని పేర్కొంటూ, బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాలల హక్కులు, విద్య హక్కు, భద్రతా హక్కు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇంచార్జ్ డి డబ్లూ ఓ పద్మ మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత, సెక్యూరిటీ అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నందిని, డీసీపీవో చైతన్య, డీహెచ్ఈడబ్ల్యూ డీఎంసీ స్వప్న, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
8 మార్చి 2026

# నేటితరం జర్నలిస్టులకు ఎంఎస్ ఆచార్య ఆదర్శనీయం

- అక్షరం అమ్ముడుపోయే వస్తువు కాదు
- విలువలతో కూడిన జర్నలిజం అవశ్యం
- మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్
- గోపనపల్లి జర్నలిస్టు కాలనీలో ఎంఎస్ ఆచార్య విగ్రహావిష్కరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : నేటితరం జర్నలిస్టులకు ఎంఎస్ ఆచార్య ఆదర్శనీయమని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రముఖ తెలంగాణ పోరాటయోధుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎంఎస్‌ఆచార్య విగ్రహాన్ని శనివారం హైదరాబాద్‌లోని గోపనపల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఎంఎస్ ఆచార్య కుమారుడు మాడభూషి శ్రీధర్ రూపొందించిన ఈ విగ్రహాన్ని శిల్పి ఉపేంద్ర తయారు చేశారు. ఎంఎస్ ఆచార్య పేపర్ బాయ్ నుంచి ఎడిటర్‌గా ఎదిగి జనధర్మ, వరంగల్ వాణి వంటి పత్రికలను నడిపి ఎన్నో అంశాలను వెలుగులోకి తీసుకొచ్చారనీ ఆయన లాంటి జర్నలిస్టులు నేటి తరం వారికి ఎంతో స్ఫూర్తి అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, పదిమందికి విషయాలు తెలియాలని తపించేవారన్నారు. ఎంఎస్ ఆచార్య వివిధ పత్రికల్లో పనిచేసి, అక్షరాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, చరిత్రలోనిలబడే వ్యక్తిగా పేరుతెచ్చుకున్నారన్నారు. ఇక వారికుమారుడు మాడభూషి శ్రీధర్ కూడా వారి తండ్రి వదలిన విలువలను ముందుకు తీసుకువెళ్తున్నారని పేర్కొన్నారు. ఎంఎస్ ఆచార్య విగ్రహ ఆవిష్కరణకు రావడం మాకు గొప్ప అవకాశమని చెప్పారు. అక్షరం అమ్ముడుపోయే వస్తువు కాదు.. సామాజిక చైతన్యం రావాలని, కొత్త తరం జర్నలిస్టు సోదరులకు అనేక అంశాలు ఇంకా నేర్చుకోవాలనీ, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా జర్నలిజం మారదు కూడదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్పోరేట్ రంగం మీడియాలో అడుగుపెట్టడం శుభపరిణామం కాదనీ, అందర్ని డిక్టెట్ చేయడం, జర్నలిజాన్ని డిక్టేట్ చేయడం సరికాదని అన్నారు. జర్నలిజం ఫీల్డ్‌లోనూ రెడీమేడ్ కాకూడదనీ, గతంలో ఒక జర్నలిస్ట్ క్యారెక్టర్ చూస్తే ఒక ఇనిస్ట్యూట్‌లా ఉండేదనీ నేడు ఆ పరిస్థితి లేకపోవడం శోచనీయమనీ, విలువలతో కూడిన జర్నలిజాన్ని ముందుకు తీసుకువెళ్లే బాధ్యత నేటితరంపై ఉందన్నారు. జనధర్మ పత్రిక మళ్లీ రావడం చాలా సంతోషకరమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో నాటి తరం నుంచి నేటితరం వరకూ అందరికీ స్ఫూర్తిని అందించిన వ్యక్తి ఎంఎస్ ఆచార్య అని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో చిన్న పత్రికలు ఎంతో ప్రముఖపాత్రను పోషించాయనీ అందులో జనధర్మ, వరంగల్ వాణి చాలా కీలక పాత్ర పోషించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరిపార్టీ అనీ జర్నలిస్టులకు న్యాయం చేస్తుందన్నారు. మేం ప్రజాస్వామ్యాన్ని విశ్వసించామని, అందుకే మేం ఇంతవరకూ పేపర్, ఛానల్ పెట్టలేదన్నారు. జర్నలిస్టులు విమర్శలు చేయవచ్చు. కానీ విలువలతో కూడా విమర్శలు చేస్తే ఎవరీ ఇబ్బంది ఉండదనీ, ప్రముఖులను మార్గదర్శంగా తీసుకొని నేటి తరం మీడియా ముందుకు వెళ్లాలని కోరారు.

మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ ఆచార్య కేవలం వరంగల్ కే పరిమితమయ్యారని, వారు హైదరాబాద్‌లో ఉండి ఉంటే ఎక్కడో ఉండేవారని అన్నారు. వరంగల్‌లో జర్నలిస్ట్ అంటే ఎంఎస్ ఆచార్య మాత్రమేనని, ఆయన వద్ద చాలా మంది పని చేశారని, వారి నుంచి ఎంతోమంది జర్నలిస్టులు ఎంతో నేర్చుకున్నారని అన్నారు. ఈ సొసైటీకి కూడా స్థలాలు వచ్చే విధంగా మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్ష్యుడు బ్రహ్మాండభేరి గోపరాజు మాట్లాడుతూ మంత్రులకు హౌసింగ్ సొసైటీ పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చారనీ, వారి వల్లనే మూడు కాలనీ ఏర్పాడ్డాయని గుర్తు చేశారు. త్వరలోనే ఈ సొసైటీలోని నాన్ అలాటీస్‌కు న్యాయం చేసే విధంగా మంత్రులు ప్రయత్నించాలని కోరారు.

మాడభూషి శ్రీదర్ మాట్లాడుతూ నాన్న చూపిన బాటలోనే నడిచానని, ఆయన వల్లనే తాను ఇంతటివాడిని అయ్యానని, వారి విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ, సీనియర్ జర్నలిస్టులు ఎన్. రామచంద్రమూర్తి, ధరూరి వెంకటాచారితో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, కాలనీవాసులు, ఎం.ఎస్.ఆచార్య కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.




# వరుడి బంధువులపై పెళ్లికూతురు బంధువుల దాడి



**ఖమ్మం, మార్చి 7 (జనంసాక్షి) :** వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఊరినుంచి పరారై.. పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. అంతే..ఆ ఫొటోలు, వారి ప్రేమ, పెళ్లి యువకుడి బాబాయిపై ఏకంగా కత్తులు, కర్రలతో దాడిచేసే స్థాయికి తీసుకెళ్లింది. ఆ ప్రేమజంట వివాహానికి పెళ్లికొడుకుకు వరుసకు బాబాయి, పిన్నయ్యే వడిత్య హేమ్లా, బుజ్జి కారణమన్న అనుమానంతో పెళ్లికూతురు తరపువారు హేమ్లా ఇంటికి వచ్చి కత్తులు, కర్రలతో దాడిచేయడంతో కత్తిపోట్లకు గురయ్యాడు. అతడిని గ్రామస్థులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కూసుమంచి మండలం లోక్యాతండాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. లోక్యాతండాలో ఆ గ్రామ ఆచారం ప్రకారం మూడురోజుల పాటు హోలీవేడుకలు జరిగాయి. అందరూ సంబరాల్లో ఉన్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన ఓ యువతి, అదేతండాకు చెందిన ఉపేందర్ ప్రేమించుకున్నారు. పెళ్లికి ఇద్దరి కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఎలాగైనా పారిపోయి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం అందరూ హోలీ వేడుకల్లో ఉన్న సమయంలో గ్రామం నుంచి వెళ్లిపోయి పెళ్లిచేసుకున్నారు. ఆ ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌ల్లో పెట్టుకున్నారు. వాటిని చూసిన గ్రామస్థులు అవాక్కయ్యారు. ఇక తమకూతురు పెళ్లికి.. వరుడికి బాబాయి వరుసైన వడిత్య హేమ్లా, అతడి భార్య బుజ్జి కారణమని అనుమానించి.. యువతి తరుపు బంధువులు హేమ్లా ఇంటిపై దాడికివెళ్లారు. క్రమంలో హేమ్లా కత్తిపోట్లకు గురవడంతో ఖమ్మం తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది. వడిత్య బుజ్జి ఫిర్యాదుమేరకు దాడిచేసిన జర్పుల సాయిచరణ్, తేజావత్ నాగేంద్రబాబు, జర్పులహరిదాసు, జర్పుల నాగమణి, జర్పుల మస్తాన్, జర్పుల విజయ, మూడ్ బుజ్జి తదితరులపై హత్యయత్నం కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భట్టి భేటీ

**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ పై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందిం చారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.

## గూగుల్ సిఇవో పిచాయ్‌కు భారీ జీతం

- కంపెనీ లాభాల దృష్ట్యా జీతం 692 మిలియన్ డాలర్లకు పెంపు



**న్యూయార్క్, మార్చి7 (జనంసాక్షి) :** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నాయకత్వంలో అల్ఫాబెట్ మార్కెట్ విలువ పైపైకి దూసుకెళుతోంది. కంపెనీ భారీ మొత్తంలో లాభాలు గడిస్తోంది. గతంలో 535 బిలియన్ డాలర్లు ఉన్న మార్కెట్ విలువ ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కంపెనీ ఉన్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న సుందర్ పిచాయ్‌కి అల్ఫాబెట్ శుభవార్త చెప్పింది. తాజాగా, భారీ మొత్తంలో ప్యాకేజీని ప్రకటించింది. ది ఫైనాన్షియల్ టైమ్స్ శనివారం తెలిపిన వివరాల మేరకు.. పిచాయ్ ప్యాకేజీని రానున్న మూడేళ్లలో 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ అల్ఫాబెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మన ఇండియన్ కరెన్సీలో దాని విలువ 6,361 కోట్ల రూపాయలు. 692 మిలియన్ డాలర్లలో పిచాయ్ జీతం కేవలం 2 మిలియన్ డాలర్లు మాత్రమే. మిగిలినదంతా పనితీరు ఆధారిత స్టాక్స్ , పరిమిత స్టాక్స్ రూపంలో ఉండనుంది. పిచాయ్‌కి ఇచ్చే పనితీరు ఆధారిత స్టాక్స్ విలువ 126 మిలియన్ డాలర్లుగా ఉంది. పరిమిత స్టాక్స్ ద్వారా పిచాయ్ 84 మిలియన్ డాలర్లు అందుకోనున్నారు. అల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యోమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన షేర్స్.. వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను యజమాన్యం కేటాయించింది. పిచాయ్ నాయకత్వం మీద ఉన్న నమ్మకంతోటే ప్యాకేజీ భారీగా పెంచినట్లు అల్ఫాబెట్ బోర్డ్ పేర్కొంది. కాగా, 53 ఏళ్ల సుందర్ పిచాయ్ 2004లో అల్ఫాబెట్‌లో ఉద్యోగంలో చేరారు. క్రోమ్‌ను అభివృద్ధి చేయటంలో కీలక పాత్ర పోషించారు. అంచెలంచెలుగా ఎదిగి గూగుల్ సీఈఓ స్థానానికి చేరుకున్నారు.

# హోలీ రంగుల తయారీ కర్మాగారంలో అగ్నిప్రమాదం

## నలుగురు కార్మికురాళ్లు దుర్మరణం

**చండీఘడ్, మార్చి7 (జనంసాక్షి) :** హర్యానాలోని ఒక హోలీ రంగుల తయారీ కర్మాగారంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కార్మికులు మరణించగా 20 మంది గాయాలపాలయ్యారు. జింద్ జిల్లాలోని సఫిడాన్ నగరంలోగల భట్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే కర్మాగారం అంతా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్మేసింది. అసలేం జరిగిందో అర్థం కాక కార్మికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం కర్మాగారానికి బయటి నుంచి లాక్ వేసి ఉండటంతో కార్మికులు అక్కడి నుంచి బయటపడలేక ఇబ్బంది పడ్డారట. కొందరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయినట్టు తెలిసింది. ఇక ప్రమాద సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను రక్షించారు. వారిని సమీపంలోని సివిల్ ఆసుపత్రికి తరలిం చారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



- ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తరగతి గదిలో విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే ప్రగతి సాధ్యమని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన చుక్కా లక్ష్మీబాయి ప్రతిభా పురస్కార ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిసరాలలోనే సైన్స్ ఇమిడి ఉందని మనిషి క్రమంగా అన్వేషణ సాగిస్తూ పరిశోధనల వైపు దృష్టి మరలించాడు అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అలవర్చుకొని భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సదస్సులో భౌతిక శాస్త్రవేత్త చుక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ చదువు వల్ల మనిషి చైతన్యవంతుడు కావాలన్నారు. సమస్యల మూలాల్లోకి వెళ్లి వాటి పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. ఫార్మా డైరెక్టర్ ఆర్.కె. మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాత్మకమైన పరిశోధనలు చేయడానికి నిర్ణీత లక్ష్యంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. తెలంగాణ బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ పిల్లలతో సామాజిక సమస్యల పరిష్కారానికి అనుగుణంగా ప్రయోగాలు చేస్తున్నామన్నారు. సామాజిక స్పృహ, సాంకేతిక స్పృహ కలిగి ఉన్నప్పుడే విద్యార్థులు ముందుకు వెళ్లగలరన్నారు. రిజిస్టర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకం పురస్కారం అన్నారు. ఈ సదస్సులో కార్యక్రమ నిర్వాహకుడు రాజు ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ జిల్లాల విద్యార్థులకు అతిథులు ప్రతిభా పురస్కారాలను అందించారు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఈ పురస్కార ప్రధాన ఉత్సవం జయప్రదంగా సాగింది.

# ప్రతిభ, నైతికత, కరుణ వైద్య వృత్తిలో మూల సూత్రాలు

- నిత్య విద్యార్థులే ఉత్తమ వైద్యులు అవుతారు
- ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వైద్య వృత్తిలో ప్రతిభ, నైతికత, కరుణ అనేవి మూల సూత్రాలని, ఆధునిక ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నిత్యం అధ్యయనం చేస్తూ వృత్తిని కొనసాగించే వారే ఉత్తమ వైద్యులుగా గుర్తింపు సాధిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సికింద్రాబాద్ లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. శాస్త్రీయ జ్ఞానం మారుతూ ఉంటుందని, సాంకేతికత అభివృద్ధి చెందుతుందని, రోగుల అవసరాలు మారుతుంటాయని, జీవితాంతం విద్యార్థులుగా ఉండే వైద్యులే ఉత్తమ వైద్యులు అవుతారని అన్నారు. ఈ వృత్తి ప్రయాణంలో మీరు ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన మూడు ముఖ్యమైన సూత్రాలున్నాయని, వృత్తిపరమైన ప్రతిభను కొనసాగించండి, మీ జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోండి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. రెండవది, నైతికత మరియు నిజాయితీతో సేవ చేయండి రోగుల నమ్మకం ఆరోగ్య సేవల పునాది అని, కరుణను ఎప్పటికీ మర్చిపోవద్దు ఎందుకంటే వైద్య సేవల హృదయం మానవ సేవే అని వివరించారు. విద్య, క్రమశిక్షణ, సమాజ సేవకు అంకితభావంతో సాగిన ఈ ఇరవై ఐదు సంవత్సరాల ప్రయాణాన్ని మనం ఈ రోజు స్మరించుకుంటున్నాం, ఇది కేవలం ఒక విద్యాసంస్థ ప్రయాణాన్ని మాత్రమే కాదు, భవిష్యత్తులో ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లబోయే కొత్త తరపు ఆరోగ్య నిపుణుల విజయాలను కూడా జరుపుకునే రోజు అని తెలిపారు. 2026 సంవత్సరపు పట్టభద్రులైన అందరికీ, ఈ కాన్వకేషన్ ఒక ముఖ్యమైన మైలురాయి, ఎన్నో సంవత్సరాల కృషి, అనేక రాత్రుల చదువు, క్లినికల్ శిక్షణలో గడిపిన గంటల సమష్టి ఫలితమే అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. అయితే అంతకంటే ముఖ్యంగా, ఇది ఒక కొత్త అధ్యాయం ప్రారంభం, ఇకపై మీరు సంపాదించిన జ్ఞానం సమాజ సేవగా మారాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. డెంటిస్ట్రీ, వైద్య రంగంలోని ఇతర శాఖల మాదిరిగానే, కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు. అది ప్రజల నమ్మకానికి ప్రతీక, మీ క్లినిక్‌లోకి వచ్చే ప్రతి రోగి వైద్య సహాయం మాత్రమే కాదు, మీ నిర్ణయంపై మరియు మీ దయపై విశ్వాసంతో వస్తాడు, మీ నైపుణ్యంతో మీరు వారి నొప్పిని తగ్గిస్తారు, వారి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి అందిస్తారు, నిజంగా చెప్పాలంటే వారి జీవితాల్లో మళ్లీ చిరునవ్వులు పూయిస్తారు. ఈ బాధ్యతను మీరు ఎల్లప్పుడూ వినయం, నైతికత మనస్ఫూర్తితో నిర్వర్తించాలని డిప్యూటీ సీఎం సూచించారు. పట్టభద్రులలో పెద్ద సంఖ్యలో యువ మహిళలు ఉండటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది మన సమాజంలో జరుగుతున్న ఒక మంచి మార్పును సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ రమేష్ రెడ్డి, తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె .రాజేష్ రెడ్డి, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మమత కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు

- గృహప్రవేశాన్ని ప్రారంభించిన మహ్మద్ షబ్బీర్ అలీ



**కామారెడ్డి, మార్చి7 (జనంసాక్షి) :** కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మి, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్దిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్దిదా రులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు.

# బీర్‌బాటిల్‌లో చేపపిల్ల



**హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) :** బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బీర్ బాటిల్‌లో చేప కదలడాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370